

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-11-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 273 పేజీలు: 8+16 వెల: 6.50

బాన్సువాడలో నాటు బాంబులు పేలుడు: ఏడుగురికి గాయాలు 3

చౌటుప్పల్‌లో జోగిని సుధాకర్ దారుణ హత్య



రాంలీలా మైదానంలో ఆదివారం ఓట్ బచావో.. దేశ్ బచావో సభలో అశేష ప్రజానీకం

ఓటు చోరుల్ని తరిమేద్దాం

ప్రధాని మోడీ, అమిత్‌షా, జ్ఞానేశ్ రాజీనామా చేయాలి



ఇసి చాటున రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం

ఇండి కూటమి మహార్యాలీలో మల్లికార్జున ఖర్గే

విద్యార్థులు, రైతులు, కార్యకర్తలతో కిక్కిరిసిన రాంలీలా మైదానం

సోనియా, రాహుల్, ప్రియాంక మమతా బెనర్జి, అఖిలేష్, తేజస్వి, ఫరూఖ్ అబ్దుల్లా, సంజయ్ రౌత్ ప్రభృతులు హాజరు

న్యూఢిల్లీ, నవంబరు 1: రాజధానిలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' పేరుతో నిర్వహించిన మహాసభ భారీ జనసందోహం మధ్య సాగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు, విద్యార్థులు, రైతులు, విపక్ష పార్టీల కార్యకర్తలతో మైదానం కిక్కిరిసిపోయింది. ఈ సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వి యాదవ్ >>2

సిఇసిని జైలుకు పంపుతాం

రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

కోట్ల ఓట్లు కొల్లగొట్టిన జ్ఞానేశ్‌ను వదలబోమని హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబరు 1: లోక్‌సభ 2024 ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), ఓటర్ల జాబితాల్లో అవకతవకల ద్వారా ఓట్లు చోరీ చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, >>2

ఢిల్లీలో ర్యాలీల హోరు

అటు ఎన్డీయె, ఇటు ఇండి కూటమి

జనసంద్రంగా మారిన రాజధాని 3

కాంగ్రెస్‌కు ఓటమి దడ

అందుకే ఆందోళనలు

సిక్కుల ఊచకోత రోజున నిరసనలా?: కేంద్ర మంత్రి నడ్డా

న్యూఢిల్లీ, చండీఘర్, పలు రాష్ట్రాల్లో బిజెపి 'లోక్ తంత్ర్ బచావో- అరాచక్ హఠావో' ర్యాలీలు

విదేశీ శక్తుల ప్రోత్సాహంతో పనిచేస్తున్న రాహుల్: నితిన్ నబీన్



'లోక్‌తంత్ర్ బచావో, అరాచక్ హఠావో' ఆందోళనల్లో హర్యానాలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్, ఢిల్లీలో కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాసింగ్ తదితరులు

న్యూఢిల్లీ / చండీగఢ్, నవంబరు 1: సిఇసిని తొలగించాలని, రాజ్యాంగ పరిరక్షణకు పోరాటంచేస్తామంటూ ఇండియా కూటమి చేపట్టిన రామ్‌లీలా ర్యాలీకి నిరసనగా బిజెపి కూడా భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించింది. లోక్‌తంత్ర్ బచావో, అరాచక్ హటావో పేరిట బీజేపీ నేతలు పాదయాత్రలు చేపట్టారు. ఢిల్లీలో సీఎం రేఖగుప్తా సారథ్యంలో బీజేపీ పాదయాత్ర జరిగింది. ఇందులో కేంద్ర మంత్రులతోపాటు పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఫరీదాబాద్‌లోని బీకేచౌక్ నుంచి కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాదయాత్ర చేపట్టారు. ఈ మార్చ్‌లో వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. విపక్షాల తప్పుడు సమాచారం, దుష్ప్రచారం, ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా ఈ పాదయాత్ర చేపట్టినట్లు బిజెపి నేతలు ప్రకటించారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా మాట్లాడుతూ 1984 నాటి హింసాకాండకు సిక్కు సమాజానికి కాంగ్రెస్ ఎందుకు క్షమాపణ చెప్పలేదని ప్రశ్నించారు. అలాగే ఢిల్లీలో >>2



హేమంత్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

రాప్తాడు నిందితుడిపై

పోలీసు కాల్పులు

తీవ్రంగా గాయపడిన హేమంత్ ఆసుపత్రికి తరలింపు

అనంతపురం క్రైమ్ నవంబర్ 1 ప్రభాతవార్త: రాప్తాడులోని స్కూలులో బాలికపై రంపంతో దాడి జరిపిన నిందితుడు హేమంత్ ఆదివారం పోలీసులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అనంతపురంలోని ఆసుపత్రికి తరలించారు. ఆత్మకూరు మండలం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారంరాత్రి నిందితుడు హేమంత్ నక్కి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందగా అతన్ని పట్టుకునేందుకు పోలీసు బలగాలు అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు పోలీసు వర్గాలు తెలుపుతున్నాయి. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు.. రాళ్లు రువ్వినట్లు తెలిపారు. తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు ఒకసారిగా అలర్ట్ అయ్యారు. ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలిసింది. తీవ్ర గాయాలతో అక్కడే కుప్పకూలాడు. తీవ్రంగా గాయపడిన నిందితుని హుటాహుటిన స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు.

20 కోట్ల ఓట్లు తొలగించే కుట్ర

పేదలు, దళితులు, మహిళలపై కక్ష పెంచుకున్న ప్రధాని..

బిజెపి సర్కార్‌ను తొలగించేదాకా విశ్రమించం

కాంగ్రెస్ శ్రేణులను ఆపలేకపోయారు: ఢిల్లీలో సిఎం రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో జరిగిన ర్యాలీలో సిఎం రేవంత్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు1: కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్ల తొలగించాలని భావించారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు దాటితే రాజ్యాంగం ద్వారా వచ్చిన ఓటు హక్కును తొలగిస్తారని ప్రజలు ఆ సంఖ్యను ఇవ్వకపోవడంతో పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై కక్ష పెంచుకున్న ప్రధానమంత్రి వారి ఓటు హక్కు తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ..ఓటు బచావో... దేశ్ బచావో.. పేరుతో ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. రాష్ట్రం నుంచి వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో కరచలనానికి పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశంలోని ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించారని, కానీ ఆ ఓటు హక్కును తొలగించేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అడ్డు పెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు.ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, 20 కోట్ల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతం ఓట్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రయోగాత్మకంగా ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ ఇప్పటికే బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిందని, ఢిల్లీలోనూ మరోసారి అలానే అధికారంలోకి రావాలని కుట్ర >>2

దూసుకొస్తున్న మురాసు తుపాను 2

4 రోజులు భారీ వర్షసూచన

పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలెర్ట్

కరవుకు సిఎం రేవంత్‌దే బాధ్యత

ఎకరానికి రూ.60 వేలు వెంటనే చెల్లించాలి

ఆదిలాబాద్ రైతు గర్జన సభలో కెటిఆర్



ఆదివారం ఆదిలాబాద్ రైతు గర్జన సభలో ప్రసంగిస్తున్న కెటిఆర్

హైదరాబాద్, నవంబరు1, ప్రభాతవార్త: రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు బాధ్యత వహిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎగ్గొట్టిన మూడు విడతల రైతు బంధుతో పాటు ప్రస్తుత యాసంగి పంట పెట్టుబడి సాయాన్ని కలిపి ఎకరానికి రూ.60 వేల చొప్పున ప్రతి రైతు ఖాతాలో వెంటనే జమ చేయాలని స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం ఆదిలాబాద్‌లో జరిగిన రైతు గర్జన సభలో ఆయన ప్రసంగించారు. రైతులతో పాటు రైతు కూలీలకు కూడా ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కంటే రెండింతల వర్షపాతం లోటు ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇలాంటి కరువు పరిస్థితులు లేవని, అన్ని వనరులు, సాగునీటి అవకాశాలు అందుబాటులో ఉన్న తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులు కరువు కోరల్లో చిక్కుకున్నారని విమర్శించారు.ఎల్‌నినో పేరు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకునే పరిస్థితి లేదని,రాష్ట్రంలో నెలకొన్న కరువుకు కాంగ్రెస్ >>2

రైతు రుణాలు రీషెడ్యూల్

బలవంతపు వసూళ్లకు బ్రేక్

కరవు పనులు మరో 50 రోజులు పెంచే యోచన

కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: వానాకాలం పంటల సీజన్ ముగియనున్నందున ఎల్ నినో ప్రభావిత ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న వ్యవసాయ కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. కరువు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించాలని కలెక్టర్లకు స్పష్టం చేసింది. రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోకుండా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సహకారంతో పంట రుణాల రీషెడ్యూల్‌కు చర్యలు చేపట్టింది. పాత రుణాలను వాయిదా వేసి, మళ్లీ కొత్తగా రుణ సదుపాయాన్ని కల్పించనుంది. అంతేకాకుండా కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్), జిల్లా సహకార బ్యాంకులు (డిసిసిబి), ఇతర ఆర్థిక సంస్థలు రుణాలను బలవంతంగా వసూళ్లను నిలుపుదల చేస్తూ అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని బ్యాంకులకు సూచనలు ఇవ్వాలని తెలిపింది. రైతులకు పెట్టుబడి రాయితీని వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పౌర సరఫరాల విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. >>2

అమిత్ షా నేడు రాక

బిజెపి మహా పాదయాత్రకు హాజరు

మొజాంజాహి మార్కెట్ మీటింగ్‌లో ప్రసంగం



హైదరాబాద్, నవంబరు1, ప్రభాతవార్త: తెలంగాణలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి రానున్న అమిత్‌షా.. అక్కడ నుంచి కాకతీయ హోటల్‌కు వెళతారు. సాయంత్రం 4 గంటలకు >>2

ఫ్రాన్స్, జర్మనీలో భారీ నిరసనలు

మెరుగైన విద్య, ఆరోగ్య సేవలందించాలి, జీవన వ్యయం తగ్గించాలంటూ డిమాండ్

ఫ్రాంక్‌ఫర్ట్‌లో దుకాణాల దోపిడి

ఐరోపా వీధుల్లో ప్రజాగ్రహం



5

రాహుల్ జీవితాంతం మాక్ పార్లమెంటులోనే

సోనియా ఎదురుచూపులు 3

నెరవేరే ఛాన్స్‌లేదు: అమిత్‌షా



5

ఇరాన్ అణు స్థావరాలను 10 నిమిషాల్లో లేపేస్తాం

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఆదివారం జరిగిన 'ఓట్ బచావో'.. దేశ్ బచావో' ఆందోళనలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా, మమత, రాహుల్, అఖిలేష్



మంత్రి పొన్నం, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఎంపి మల్లు రవి తదితరులు



డి.సిఎం భట్టి, ప్రభుత్వ సలహాదారు విహెచ్

రైతు రుణాలు రీషెడ్యూల్

>> ఆయా శాఖలు బాధితులను గుర్తించి, నష్టాల వివరాలను సేకరించడంతో పాటు, ఉపశమన చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు విపత్తుల నిర్వహణ శాఖకు తెలియజేయాలని పేర్కొంది. అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి రాయితీ జమ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించింది. జాతీయ విపత్తు నిర్వహణ నిధి నిబంధనలకు అనుగుణంగా రైతులకు సహాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయ, సహకార శాఖలను ఆదేశించింది. కరువుతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైన ప్రాంతాల్లో పశు శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు పశుగ్రాస బ్యాంకుల ఏర్పాట్లు చేయాలని సూచించింది. తీవ్ర కరువు నెలకొన్న మండలాల్లో గ్రామస్థాయిలో సమగ్ర సమాచారాన్ని సేకరించి ఏడు రోజుల్లో కేంద్ర వ్యవసాయ, హోం మంత్రిత్వ శాఖలకు పంపాలని ప్రణాళిక శాఖను ప్రభుత్వం ఆదేశించింది. పంటల నష్టం, నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, పశుగ్రాసం కొరత, గ్రామీణ ఉపాధిపై ప్రభావం వంటి అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించడం ద్వారా కరవు తీవ్రతను అంచనా వేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల్లో అవసరమైన ఉపశమన చర్యలను కలెక్టర్లు పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో ఉపాధి కోల్పోయే గ్రామీణ కుటుంబాలకు పనులు కల్పించేందుకు వీబీ జీరాంజీ పథకం కింద చేపట్టగల పనులను గుర్తించాలని ఆదేశించింది. వీబీ జీరాంజీ పథకం కింద కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా ఖర్చు భరించేలా అదనంగా 50 పనిదినాలు కల్పించాలని తాజాగా రాష్ట్రం కోరింది. విద్యుత్ అవసరాలను తీర్చేందుకు 1500 మెగావాట్ల అదనపు విద్యుత్, వ్యవసాయానికి అవసరమైన అదనపు ఎరువులు అందించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ రుణ పరిమితిని 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలని కోరింది. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అదనపు ఆర్థిక సహకారం అందించాలని అభ్యర్థించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో వెల్లడించింది. అంతేకాకుండా కరువు నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలను తక్షణమే రాష్ట్రానికి పంపించాలని, రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధికి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం విడుదల చేయాలని కోరింది.కాగా ఎల్ నినో ప్రభావంతో వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక కరువు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. మొత్తం 33 జిల్లాల్లో హైదరాబాద్, పెద్దపల్లి మినహా మిగిలిన 31 జిల్లాలను కరువు జాబితాలో చేర్చింది. వీటిలో 111 మండలాల్లో తీవ్ర కరువు, 254 మండలాల్లో మధ్యస్థ కరువు పరిస్థితులు ఉన్నట్లు వెల్లడించింది. తాజాగా ఈ మండలాల్లో కరువు పునరావాస చర్యలను వేగవంతం చేస్తోంది.

రేవంత్‌దే బాధ్యత

>> ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని కలిపి ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే చెల్లించాలని, ప్రతి ఒక్క రైతు ఖాతాలో రావాల్సిన మొత్తం జమ చేయాలని ఆదిలాబాద్ రైతు గర్జన సభలో కేటీఆర్ డిమాండ్ చేశారు.రైతుబంధు రూ.15 వేలకు పెంచుతానని మోసం చేశారు.. హామీలన్నీ ఏమయ్యాయి? అని ప్రశ్నించారు. రూ. 15 వేల రైతుబంధు ఇస్తానని చెప్పి రైతులను మోసం చేసిన దుర్మార్గుడు ఎవరో ప్రజలు ఆలోచించాలని అన్నారు.రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, 2022 మే 6న వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతులకు ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. మేం హామీ ఇస్తే చేసి చూపిస్తామని రాహుల్ గాంధీ చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది? రైతుబంధు ఏమైంది? తులం బంగారం ఏమైంది? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏమైంది? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు.రైతులకు మూడు విడతల రైతుబంధు ఎగ్గొట్టారని, నాలుగు పంటలకు సంబంధించిన పెట్టుబడి సాయం అందించాల్సి ఉందని తెలిపారు. 21 లక్షల మంది రైతులకు రైతుబంధు అమలు చేయాలని, కౌలు రైతులకు ఆర్థిక సహాయం చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 36 వేల మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు."ెైతుబంధు దేవుడెరుగు.. నేడు రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు వేయడానికి రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటున్నారని, దుక్కి దున్నొద్దు.. భూములను పడావు పెట్టుకోవాలని చెప్పే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.రైతుబంధు బంద్ అయింది కానీ రాహుల్ బంధు మాత్రం బంద్ కాలేదని ఎద్దేవా చేశారు. రైతులకు డబ్బులు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం ఢిల్లీకి మాత్రం డబ్బులు క్రమం తప్పకుండా పంపుతోందని విమర్శించారు. రైతుల ఆశలు అడియాశలయ్యాయని, రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని మరింత సంక్షోభంలోకి నెట్టిందన్నారు.రాష్ట్రంలో అన్ని రంగాలకు హాలిడే ప్రకటించినట్లుగా పాలన సాగుతోందని అన్నారు.మంచిగా ఉన్న విద్యుత్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందని, పరిశ్రమలు మూతపడే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. రైతులకు సాగునీరు లేదు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, ప్రోత్సాహం లేదు.. రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. తెలంగాణ కంటే రెండింతల వర్షపాతం లోటు ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు లేవని, తెలంగాణలో మాత్రం సాగునీటి వనరులు అందుబాటులో ఉన్నా రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

దూసుకొస్తున్న మురాసు తుపాను

4 రోజులు భారీ వర్షసూచన

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన మురాసు తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు, నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా ఈ నెల 3న ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 2వ తేదీన తెలంగాణలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే జనగాం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరిలో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఖమ్మం, నల్గొండ, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌క ర్నూల్, వనపర్తి, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం,వికారాబాద్,సంగారెడ్డి,మెదక్, కామా రెడ్డి, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

వారం - వర్జ్యం

02-11-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె,
తి.అష్టమి మ.1.13, న.ఆశ్లేష రా.3.47,
వ.సా.4.56 – సా. 6.29
దు.మ.12.14–మ.1.00
2.మ.2.32–మ.3.18
రాహు. ఉ.7.30–ఉ.9.00. శుభ. స . లేదు

వార్తాఫలం

మేషం : ఎంత సహాయం చేసినా తృప్తి చెందని సోదర వర్గాన్ని చూసి అసహనానికి లోనవుతారు.

వృషభం : సంతాన అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. పూర్వంకన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. క్రమ శిక్షణతో ఉంటారు.

మిథునం : ఉద్యోగం వంటి ముఖ్య విషయాలు కలిసి వస్తాయి. ఆరోగ్యపరంగా తీసుకునే జాగ్రత్తలు మంచి ఫలితాలనిస్తాయి.

కర్కాటకం : మీ కృషివల్ల మీరు సుఖపడక పోయినా మీవాళ్ళు సౌఖ్యంగా ఉంటారు. ఇతురులకు సహాయం చేసి విరోధి అవుతారు.

సింహం : ప్రతికూల వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధించడానికి ఎంతో కృషిచేస్తారు.

కన్య : కోర్టు సంబంధమైన వ్యవహారాలలో మధ్యవర్తుల సహాయ సహకారములను పొందుతారు. శుభ ఆహ్వానాలు అందుకుంటారు.

తుల : కాంట్రాక్టులు సంబంధించిన ఒప్పందాలు కుదురుతాయి. అనూహ్యంగా స్థిరాస్తుల ధరలు పెరుగుతాయి.

వృశ్చికం : వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. గృహ కొనుగోలు ముమ్మరం చేస్తారు.

ధనుస్సు : న్యాయబద్ధముగా రావలసిన ధనము వాయిదాల పద్ధతిలో స్వీకరిస్తారు. బంధువుల కలయిక.

మకరం : బాధ్యతల వెనుక ఉన్న క్లిష్టమైన సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి. ఒత్తిళ్ళను తట్టుకుంటారు.

కుంభం : సర్దుబాటు చేసేకొద్దీ సమస్యలు పుట్టు కొస్తాయి. కుటుంబ గౌరవానికి హాని ఉండదు.

మీనం : ఇతరుల విషయాలలో జోక్యము వద్దు. విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయటపడుటకు జాగ్రత్తను వహించండి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ఓటు చోరుల్ని తరిమేద్దాం

>> తదితర నేతలు కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా కలిసి మహిళలు, దళితులు, యువత ఓట్లను దొంగిలించేందుకు కుట్ర పన్నారని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో పనిచేస్తూ ఓట్ల చోరీకి సహకరిస్తున్నారని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ భూమిపై ఎక్కడ దాక్కున్నా వెతికి పట్టుకుంటాం అని హెచ్చరించారు. మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల తీర్పుతో గెలవలేదని ఆరోపించారు. సీబీఐ, ఈడీతో విపక్షాలను భయపెట్టాలని చూస్తున్నా తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. మోడీని గద్దె దించితేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని పిలుపునిచ్చారు.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఢిల్లీలో విపక్ష నేతలు చేపట్టిన మార్చ్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం భయపడి కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో దుకాణాలను బలవంతంగా మూయించిందని ఆరోపించారు. వ్యాపారులను భయపెట్టి ప్రజాస్వామ్య గొంతును నొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది పేర్లను తొలగించి ఎన్నికలను ప్రభావితం చేయాలని చూస్తున్న శక్తుల ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు.

ఉత్తరప్రదేశ్‌లోని డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు డబుల్ జీరోగా మారిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. యూపీలో 1.27 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని ముఖ్యమంత్రి స్వయంగా అంగీకరించారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాతే ఈ విషయం వారికి అర్థమైందని విమర్శించారు.

ఓటు చోరులపై మహాభారతం: తేజస్వి

రామ్‌లీలా మైదానంలో సాధారణంగా రామాయణ గాథలు వినిపిస్తాయని, కానీ ఇప్పుడు ఓటు చోరులకు వ్యతిరేకంగా మహాభారతం జరుగుతోందని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు. కేంద్ర పాలకులు శకుని మాదిరిగా అక్రమ పావులు కదుపుతున్నారని విమర్శించారు. వారికి బుద్ధి చెప్పేందుకు ఈ మైదానాన్ని కురుక్షేత్రంగా మారుస్తామని హెచ్చరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను మోదీకి కీలుబొమ్మగా అభివర్ణించారు. రాజ్యాంగ పదవుల్లో ఉండి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

సీఈసీ రాజీనామాకు డిమాండ్

ఈ సభలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ తదితరులు ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించి రాజకీయ భవిష్యత్తును మార్చేందుకు కుట్ర జరుగుతోందని విపక్ష నేతలు ఆరోపించారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈవీఎంలకు బదులుగా మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. ఎన్నికల అక్రమాలకు వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి రావడానికి ఈ సభ కీలకంగా నిలుస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్‌కు ఓటమి దడ

>> ప్రతిపక్షాల నిరసనలో పాల్గొన్నందుకు రాహుల్ గాంధీని విమర్శించారు. సిక్కుల త్యాగాలకు, జరిగిన మారణకాండలకు, హత్యలకు కాంగ్రెస్ పార్టీ ప్రాయశ్చిత్తం కోసం వారు క్షమాపణ చెప్పి ఉండాల్సింది. కానీ, వారు ఈ రోజు నిరసన తెలిపేందుకు వీధుల్లోకి వచ్చారు. మన సిక్కు సోదరులు ఊచకోతకు గురవుతున్నప్పుడు మారణకాండ జరుగుతున్నప్పుడు ఒక పెద్ద చెట్టు కూలితే భూమి కంపిస్తుందని మీ తండ్రి వ్యాఖ్యానించారు. ఆభూకంపం కారణంగా నా సిక్కు సోదరుల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి మీరు పశ్చాత్తాపపడి క్షమాపణ లు ఎందుకు కోరలేదని జెపినడ్డా ధ్వజమెత్తారు. అదేవిధంగా మరో వైపు పశ్చిమఢిల్లీలోనే కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్రప్రధాన్ నేతృత్వంలో మరో ర్యాలీని కొనసాగించారు. ఇదొక రాజకీయ కార్యక్రమం కాదని, ప్రతిపక్షాల కుట్రలు, అసత్యాలపై సాగిస్తున్న సైద్ధాంతిక పోరాటమని తెలిపింది. ఢిల్లీలో సీఎం రేఖాగుప్తా నిర్వహించిన ర్యాలీలో పలువురు కేంద్రమంత్రులు జెపినడ్డా, భైరవ్‌సింగ్ షెకావత్ తదితర కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఒకదశలో పోటాపోటీ ర్యాలీలతో దేశ రాజధాని నగరం ఉద్రిక్తంగా మారింది. దేశవ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాలే కాకుండా అన్ని చోట్లాకూడా బిజెపి, ఎన్డీయే కూటముల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలునిర్వహించారు. విపక్షాల ఆరోపణలను బీజేపీ ఒక నాటకంగా కొట్టిపారేసింది. ఇదిలా ఉండగా, దిల్లీ సహా పలు రాష్ట్రాల్లో బీజేపీ పాదయాత్రలు చేపట్టింది.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు పోటాపోటీ ర్యాలీల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్, సీఆర్పీఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్కు చెందిన సుమారు 10,000 మంది సిబ్బందిని మోహరించారు. ఒక్క రామ్లీలా మైదానం చుట్టూనే 4,000 మందిని నియమించారు. 250కి పైగా సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు సీనియర్ పోలీస్ అధికారి రోహిత్ రాజ్బీర్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ర్యాలీల వల్ల దీపావళి పండుగ సమయంలో వ్యాపారాలు దెబ్బతింటాయని చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి ప్రాంతాల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల రూ.2,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లవచ్చని అంచనా వేస్తున్నారు.

ఓటమి నైరాశ్యంతోనే వ్యవస్థలపై కాంగ్రెస్ దాడి...నితిన్ నబీన్

ఎన్నికల్లో ఓటమి పాలైన నైరాశ్యంతో కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలపై దాడి చేస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌మర్శించారు. వంశపారంపర్య పాలనను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని, రాజ్యాంగ పరిరక్షకులుగా నటిస్తూ ఈసీ నిబంధనలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. విదేశీ శక్తుల ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇండీ కూటమి ర్యాలీకి పోటీగా హరియాణాలో అధికార బీజేపీ చేపట్టిన ర్యాలీ పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలుచేసారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు లోక్‌తంత్ర్ బచావో, అరాచక్ హటావో పేరిట బీజేపీ ర్యాలీలు నిర్వహించింది. ఈ క్రమంలోనే రోహ్‌తక్‌లోని ఛోటూరామ్ పాలిటెక్నిక్ గ్రౌండ్ నుంచి మోడల్ టౌన్‌లోని డిపార్క్ వరకు నితిన్ నబిన్ పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ ప్రజా తీర్పును పొందడంలో విఫలమై రాజ్యాంగ సంస్థలను నిందిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు.

అమిత్ షా నేడు రాక

>> 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచక వాదాన్ని అంతం చేద్దాం (లోక్‌తంత్రా బచావో.. అరాచకత హటావో)' పేరుతో నిర్వహించే బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ చౌరస్తా వరకూ మహా పాదయాత్రలో పాల్గొంటారు. బషీర్‌బాగ్ నుంచి 3 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని, నుంచి 5 నుంచి 5.30 గంటల వరకూ ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. తర్వాత ఆరు గంటలకు ఢిల్లీ బయలు దేరి వెళతారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య గల రిజర్వు సమయంలో రాష్ట్ర ప్రముఖులతో అమిత్‌షా భేటీ అవుతారని సమాచారం. కాగా, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మహా పాదయాత్ర ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పరిశీలించారు. సర్ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ అసత్య ప్రచారాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం విప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహా పాదయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎసలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రత్యామ్నాయం కోసం బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 1.55 గంటల కు అమిత్ షా ప్రత్యేక విమానంలో బేగంపేట చేరుకుంటారు. 2.10 నుంచి 3.55 వరకు కాకతీయ హోటల్ లో భోజన విరామం.. పార్టీ నేతలతో సమావేశం ఉంటుంది. 3.50 కి నిజాం కాలేజ్ వద్దకు చేరుకుంటారు. నాలుగు గంటలకు నిజాంకాలేజ్ వద్ద ఉన్న బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. మొజంజాహీ మార్కెట్ చౌరస్తా వద్ద ముగియనుంది. ఈ ముగింపు సభలో అమిత్ షా పార్టీ శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. కాగా,పార్టీ శ్రేణులతో మాత్రమే కాకుండా.. తటస్థులు, వివిధ వర్గాలకు చెందిన నిపుణులు, వైద్యులు, న్యాయవాదులు, మేధావులు ఈ యాత్రలో పెద్ద ఎత్తున భాగస్వాములయ్యేలా బీజేపీ వ్యూహరచన చేసింది. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలపై, ముఖ్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితాల అంశంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే ప్రధాన లక్ష్యంగా ఈ మహా పాదయాత్రను చేపడుతున్నట్టు పార్టీ నేతలు వెల్లడించారు. ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయని, దీనివల్ల సమాజంలో అరాచకం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. త్వరలో జరిగే గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలతో పాటుగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేడర్‌లో జోష్ నింపేందుకు హైదరాబాద్ కేంద్రంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ జాతీయ స్థాయిలో చేస్తున్న ఆందోళనకు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రం నుంచే సమాధానం ఇచ్చేలా బీజేపీ ప్లాన్ చేస్తోంది. దీంతో, ఈ మహా పాదయాత్ర తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా కనిపిస్తోంది.

సిఇసిని జైలుకు పంపుతాం

>> చివరకు జైలుకు పంపిస్తామని ఆదివారం ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఇండియా కూటమి సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఓట్ల చోరీ సాధారణ దొంగతనం కాదని, ఇది భారతదేశంలోని ప్రతి ఒక్కరి గొంతును దొంగిలించడమేనని అన్నారు. దీనిని దేశద్రోహంగా అభివర్ణించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయ్యేవారు కాదని, అమిత్ షా కేంద్ర హోంమంత్రి అయ్యేవారు కాదని రాహుల్ గాంధీ ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికలు అక్రమంగా జరిగాయని పేర్కొన్నారు. ఈవీఎంల ద్వారా, ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం ద్వారా ఓట్లను చోరీ చేశారని ఆరోపించారు. 2024 ఎన్నికల అనంతరం 15 శాతం మంది ఓటర్ల పేర్లను తొలగించారని, ఇండియా కూటమి, ఎన్డీఏ మధ్య ఓట్ల తేడా మూడు శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం గణాంకాలే చెబుతున్నాయని ఆయన అన్నారు. 2020-21 కరోనా మహమ్మారి సమయంలో తాను చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తాను చెప్పిన విషయాలు చివరకు నిజమవుతున్నాయని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. భారతదేశంలోని ప్రతి పౌరుడికి, యువతకు తాను ఒక విషయం చెబుతున్నానని, జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించబడతారని, జైలుకు వెళ్తారని అన్నారు. దేశంలోని విద్యా వ్యవస్థ నుంచి దర్యాప్తు సంస్థల వరకు అన్ని వ్యవస్థలను ఆర్ఎస్ఎస్ తన ఆధీనంలోకి తీసుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనివల్ల రైతులు, కార్మికులు, యువత తమ హక్కులను పొందలేకపోతున్నారని విమర్శించారు.

హిందూ పురాణాలను ప్రస్తావిస్తూ తాను కోరుకునే భారతదేశం ఎలా ఉండాలో వివరించారు. శివుడి పెళ్లి ఊరేగింపులో ఎవరైనా పాల్గొనవచ్చని, ఎవరినీ అడ్డుకోరని, అలాంటి భారతదేశమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అంతం కానివ్వబోమని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయనివ్వబోమని స్పష్టం చేశారు. ఎంత డబ్బు ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కారని అన్నారు. ఎన్నికల ప్రక్రియను, సంస్థలను ప్రభావితం చేసేందుకు బీజేపీ డబ్బును ఉపయోగిస్తోందని ఆరోపించారు.

మోడీ రాజీనామా చేయాల్సిందే...ఏఐసిసి చీఫ్ ఖర్గే డిమాండ్

రాహుల్ గాంధీ కంటే ముందు మాట్లాడిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంతో పాటు మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు ఓట్ల చోరీ ద్వారానే అధికారంలోకి వచ్చాయని ఆరోపించారు. ప్రజలు వారికి ఓట్లు వేయడంలేదని, వారే తమకు తాముగా అధికారాన్ని ఎంచు కుంటున్నారని విమర్శించారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని అధికారంలో నుంచి తొలగించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ పదవి నుంచి దిగిపోతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా నిర్వహించిన ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తదితర ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు.

20 కోట్ల ఓట్లు తొలగించే కుట్ర

>> పన్నుతున్నారని సీఎం అన్నారు. ఈ కుట్రను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాహుల్ గాంధీ నిర్ణయించారని తెలిపారు. సభకు తెలంగాణ నుంచి 15 వేల మంది వచ్చేలా పీసీసీ ఆధ్వర్యంలో రైళ్ల ఏర్పాటు చేస్తే, ఆఖరి నిమిషం వరకు నమ్మించి చివర్లో రైళ్ల రద్దు చేసి కార్యకర్తలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైళ్లు ఇవ్వకపోయినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా ఢిల్లీ వచ్చారని, మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ కార్యకర్తల సంకల్పాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు.

కోస్తా జిల్లాలకు మరో తుపాను ముప్పు

విజయవాడ, నవంబరు 1 (ప్రభాతవార్త): నైరుతి, ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో మురసు తపాన్తు కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఇది గడిచిన 6 గంటల్లో గంటకు 27 కి.మీ. వేగంతో కదులుతుందని ప్రస్తుతానికి చెన్నైకి 480 కిమీ, నెల్లూరుకు 550 కిమీ, మచిలీపట్నానికి 560 కిమీ, ఒంగోలుకు 600 కిమీ, విశాఖపట్నానికి 610 కిమీ, దూరంలో ఉందని వెల్లడించారు.సోమవారం ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడి ఆ తర్వాత వాయువ్య దిశగా ప్రయాణించి సోమవారం అర్ధరాత్రి–మంగళవారం తెల్లవారుజాము సమయంలో నెల్లూరు మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరందాటే సమయంలో గంటకు 100 నుండి 110 కి.మీ వరకు గరిష్ఠంగా 120 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకి వెళ్ళరాదని హెచ్చరించారు.

తుపాను ప్రభావంతో రానున్న మూడురోజులు దక్షి ణకోస్తా, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి కోస్తా తీరం వెంబడి గంటకు 8090 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని



ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాసామ్య పరిరక్షణకు విశాల ప్రజాసత్యాగ్రహం

నియంతృత్వానికి బాటలు వేస్తున్న సిఇసి

ఢిల్లీలో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: దేశ స్వాతంత్ర్యం కోసం నాడు గాంధీ సత్యగ్రహం చేస్తే నేడు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో విశాల ప్రజలు సత్యగ్రహం చేస్తున్నారని ఇది నియ తృత్వానికి పౌర హక్కులకు మధ్య సాగే శాంతియుత యద్ధం అని పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు, ఢిల్లీలోని తెలంగాణభవన్ వద్ద తెలం గాణ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రసంగించారు. భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ నియతృత్వానికి బాటలు వేసు న్నారని ఇది దేశ భవిష్యత్‌కు మంచిది కాదని ఆవేదన చెందారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా ర్యాలీకి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీకి తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్యకర్తలందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండియా కూటమి మెగా ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణు లకు పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు.

మురాసు తుఫానుపై టిజిఎస్‌పిడిసిఎల్ అప్రమత్తం

21 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: మురాసు తుఫాను ప్రభావంతో తెలం గాణలోని పలు జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో టిజిఎస్‌పిడిసిఎల్ అప్రమత్తమైంది. సంస్థ పరిధిలోని 21 సర్కిళ్ల అధికారులు, ఫీల్డ్ సిబ్బంది సోమవారం ఉదయమే తమ తమ విధి నిర్వహణ కేంద్రాలకు తప్పనిసరిగా చేరుకోవాలని ఆదేశించింది. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాలతో పాటు క్యూర్ ప్రాం తంలో వాతావరణ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించింది. విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లను తనిఖీ చేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించింది.

అత్యవసర మరమ్మతుల కోసం సిబ్బంది, వాహనాలు, పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. తుఫాను ప్రభావం ఉన్నంతకాలం అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని పర్యవేక్షి ంచాలని సూచించింది. విద్యుత్ సమస్యలు, అత్యవసర పరిస్థితులపై ప్రజలు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని టిజిఎస్‌పిడిసిఎల విజ్ఞప్తి చేసింది.

గ్లోబల్ రియల్ ఎస్టేట్ సూచీలో భారత్ టాప్ 30 ర్యాంక్

వచ్చే ఐదేళ్లలో జిడిపిలో 13 శాతానికి రియల్‌ఎస్టేట్ వాటా

నరెడ్కో ముగింపు సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఆదివారం నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీషో ముగింపు వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 1 : ముఖ్య అతిథి కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ రియల్ ఎస్టేట్ ట్రాన్స్‌పరెన్సీ ఇండెక్స్ లో భారత్ టాప్ 30 దేశాల్లో స్థానం సంపాదించిందని కేంద్ర మంత్రి గంగా పురం కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీషో ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతినిధులనుద్దేశించి మాట్లాడారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా భారత్ నిలిచిందన్నారు. దేశంలో రియల్ ఎస్టేట్ రంగం జీడీపీలో ప్రస్తుతం 7 శాతం వాటా కలిగి ఉందని, 2030 నాటికి అది 13 శాతానికి చేరుకునే అవకాశం ఉందని అన్నారు. దేశంలో రియల్ ఎస్టేట్ రంగంపై ఇన్వెస్టర్ల విశ్వాసం పెరుగుతోందని చెప్పారు. ప్రతి కుటుంబానికి అందుబాటు ధరల్లో సొంత ఇల్లు లభించాలన్నదే లక్ష్యంగా ఉండాలని సూచించారు. రియల్ ఎస్టేట్‌ను కేవలం భూమి, భవనాలు, లావాదేవీల వ్యాపారంగా చూడకుండా ప్రజల జీవితాలు, వారి ఆశయాలతో ముడిపడిన రంగంగా భావించాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు. నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి కొప్పుల మాట్లాడుతూ దేశంలో అత్యధిక సంపదను సృష్టించే రంగాల్లో రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఒకటని అన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు గణనీయంగా పెరగడంతో డెవలపర్లు తీవ్ర భారాన్ని ఎదుర్కొంటున్నారని, వాణిజ్య, అద్దె ఆస్తులపై ఇప్పటికీ 18 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, ఈ భారాన్ని తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో రియల్ ఎస్టేట్ రంగానికి తగిన ప్రోత్సాహం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నారెడ్కో తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ ప్రాపర్టీ షో-2026 ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఆర్థిక సంస్థలు, అనుబంధ రంగాల ప్రతినిధులు, గృహ కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రాపర్టీ షోలో 75 మంది డెవలపర్లు, బిల్డర్లు, ఐదు ఆర్థిక సంస్థలు, అనుబంధ రంగాలకు చెందిన 10 సంస్థలు పాల్గొన్నాయి. అపార్ట్ మెంట్లు, విల్లాలు, ఓపెన్ ప్లాట్లు, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన 500కు పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వివిధ ప్రాంతాలు, బడ్జెట్లకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ప్రాపర్టీలను పరిశీలించే అవకాశం కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు లభించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో కొనుగోలుదారుల నుంచి వివిధ రకాల ప్రాపర్టీలపై ఆసక్తి వ్యక్తమైంది.

రాహుల్ జీవితాంతం మాక్ పార్లమెంటులోనే

సోనియా ఎదురుచూపులు నెరవేరే ఛాన్స్‌లేదు..

సిక్కుల మనోభావాలు దెబ్బతీసిన ఇండియా కూటమి ర్యాలీ

వ్యాపారుల వినతిని సైతం వారు విస్మరించారు: అమిత్‌షా

చండీగఢ్, నవంబరు 1: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. 1984 నవంబర్ 1 సిక్కుల వ్యతిరేక అల్లర్లు జరిగిన రోజే కాంగ్రెస్ రామ్‌లీలా మైదాన్ ర్యాలీ చేపట్టడాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం ద్వారా సిక్కుల మనోభావాలను ప్రతిపక్షాలు దెబ్బతీశాయని అన్నారు. అల్లర్ల బాధితుల గాయాలపై ఉప్పు చల్లినట్లు అభివర్ణించారు. చండీగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ 1984 నవంబర్ 1న జరిగిన హింసలో వేలాది మంది సిక్కులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఈ అల్లర్లను కాంగ్రెస్ ప్రేరేపించిందని ఆయన విమర్శించారు. వేలాది మందిని సజీవ దహనం చేశారని, అనేక కుటుంబాలు ఇళ్లను విడిచి వెళ్లాల్సి వచ్చిందని, పిల్లలు అనాథలుగా, మహిళలు వితంతువులుగా మారారని పేర్కొన్నారు. అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన వ్యాఖ్యల్ని కూడా అమిత్ షా ప్రస్తావించారు. పెద్ద చెట్టు కూలినప్పుడు భూమి కంపిస్తుంది అని రాజీవ్ గాంధీ సిక్కుల ఊచకోను తక్కువ చేసి మాట్లాడినట్లు అమిత్ షా వెల్లడించారు. 1984 అల్లర్ల బాధితుల



పట్ల సున్నితత్వం లేకుండా కాంగ్రెస్ ర్యాలీ నిర్వహి స్తోందని అమిత్‌షా ఆరోపించారు. నవం బర్ 1,2,3 తేదీల్లో కార్యక్రమాలు నిర్వహించవద్దని బీజేపీ కాంగ్రెస్‌ను కోరినట్లు ఆయన చెప్పారు. విదేశాల నుంచి వచ్చే ఆదేశాల మేరకు నవంబర్ 1 ర్యాలీ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించిందని అమిత్ షా ఆరోపించారు. దీపావళి వ్యాపారాలు దెబ్బతీస్తున్నారని ఢిల్లీ వ్యాపారులు విజ్ఞప్తిని కూడా ఇండియా కూటమి పట్టించుకోలేదని అమిత్ షా విమర్శించారు. పండుగకు ముందు మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో ఢిల్లీలో సుమారు రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో రాహుల్ వరస పరాజయాలను ప్రస్తావిస్తూ ఆయనను ప్రధానిగా చూడాలని తల్లి సోనియా ఆకాంక్షిస్తున్నారని, ప్రతిపక్షాలు కొత్త రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తు న్నాయని, మాక్ పార్లమెంట్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. రాహుల్ జీ మీరు ప్రధానమంత్రి కావాలనుకుంటే జీవితాంతం మాక్ పార్లమెంట్‌లోనే ఉండిపోండి. ఎందుకంటే మీ వంతు ఎప్పటికీ రాదని షా సెటైర్లు వేశారు.

అమల్లోకి వచ్చిన ట్రూఅప్ బాదుడు

కరెంట్ వినియోగదార్లపై రూ.7,635 కోట్ల వడ్డన

అడ్డగోలు దోపిడీకి సిద్ధమైన విద్యుత్ పంపిణీ సంస్థలు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీలు మోత మోగనున్నాయి. ఆదివారం నుండి ఈ ట్రూ అప్ (అంచనాలను మించి వాస్తవికంగా అయిన వ్యయం) చార్జీల వసూలుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు నడుం కట్టాయి. ఈ ట్రూఅప్ రూపంలో రూ.7,635.22 కోట్లను వసూలు చేసు కోవడానికి విద్యుత్ పంపిణీ సంస్థల చేసుకున్న పిటిషన్లపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సీ) విచారణ చేసి అనుమతినిచ్చిన నేపథ్యం లో ఈ నెల 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చాయి. యూనిట్‌కు 30పైసలు, డిసెంబరు నుంచి యూ నిట్‌కు 50పైసల చొప్పున వసూలు చేయనున్నా యి. 29 నెలలపాటు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, 26 నెలల పాటు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చార్జీలు వసూలు చేసుకు నేందుకు విద్యుత్ నియంత్రణ కమిషన్ ఇటీవలే అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. 2022 -23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబం ధించిన విద్యుత్ కొనుగోలు, ఆదాయ ట్రూఅప్ మొత్తాల్లో రూ.7,635.22 కోట్లను దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల ద్వారా వసూ లు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఇటీవల మార్గాన్ని ఖరారు చేసింది. ఇం దులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను రైతుల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వం నుంచి రాబట్టనున్నాయి. మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర అర్హత కలిగిన విద్యుత్ కనెక్షన్ల నుంచి వసూలు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి రూ.2,215 కోట్లు, వినియోగదారుల నుంచి 5.420 కోట్లు వసూలుకు పంపిణీ సంస్థలు సిద్ధమయ్యాయి.

సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో రాజస్థాన్ యువకుడి వద్ద

రూ.60 లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత



సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో రాజస్థాన్ యువకుడి వద్ద పట్టుబడిన రూ.60 లక్షల నకిలీ కరెన్సీని మీడియాకు చూపుతున్న రైల్వే పోలీసులు.

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: సికిందరా బాద్ రైల్వే స్టేషన్‌లో రాజస్థాన్‌కు చెందిన 19 యేళ్ల యువకుడి వద్ద 60 లక్షల రూపాయల నకిలీ కరెన్సీని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. 500 రూపాయల నోట్లతో కూడిన 12 బండిళ్ల నకిలీ కరెన్సీని సదరు యువకుడు రా జస్తాన్ నుంచి ముంబాయికి హైదరాబాద్ మీదుగా తరలిస్తుండగా సికిందరాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాంపై శనివారం అర్థరాత్రి దాటిన తరువాత రైల్వే పోలీసుల తనిఖీలో పట్టు బడ్డాడు. దీనికి సంబం ధించిన వివరాలను రైల్వే ఐజి రమేష్‌నాయుడు ఆది వారం మీడియాకు వెల్లడిం చారు. రాజస్తాన్ నుంచి కొందరు వ్యక్తులు నకిలీ కరెన్సీని హైదరా బాద్‌తోపాటు ఇతర నగ రాలకు రైల్లే తరలిస్తు న్నట్లు అందిన సమాచా రంపై సికిందరాబాద్ సహా నగరంలోని ఇతర రైల్వే స్టేషన్లలో నిఘా వుంచారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ నంబర్ 10పై రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరు గుతున్న ఓ యువకుడు కనిపించారు. అతన్ని వద్ద వున్న సంచిలో 500 రూపాయల నోట్లతో వున్న 60 లక్షల రూపాయల నకిలీ కరెన్సీ నోట్లు కని పించాయి. అతన్ని విచారించగా రాజస్తాన్‌లోని బికనీర్ జిల్లాకు చెందిన శివరతన్ మహియా (19)గా తేలింది. ఇదే ప్రాంతానికి చెందిన ఓం ప్రకాష్ (25) అనే పాత నేరగాడి ఆదేశాల మేరకు అతను నకిలీ నోట్లను రాజస్తాన్‌లో ని జైపూర్ నుంచి హైదరాబాద్ మీదుగా ముంబాయికి తరలిం చేందుకు అంగీకరించినట్లు తేలింది. నిందితుడి వద్ద ఒక ఐ ఫోన్‌ను జప్తు చేశారు. ఓం ప్రకాష్‌తో శివరతన్‌కు రెండు నెలల క్రితం పరిచయం ఏర్పడింది. ఆర్థికంగా కష్టాల్లో వున్న శివరతన్‌ను నకిలీ కరెన్సీ చలామణిలో పాల్గొంటే దండిగా కమీ షన్ ఇస్తానని ఓంప్రకాష్ నమ్మించాడు. ఈ నేపథ్యంలో గత నెల 28వ తేదీన శివరతన్ జైపూర్‌లో రైలు ఎక్కి అక్టోబరు 30 వ తేదీన కాచిగూడ స్టేషన్‌లో దిగాడు. ఆ రోజున సమీపంలోని లాడ్జిలో వుండి శనివారం రాత్రి సికిందరాబాద్ స్టేషన్ నుంచి ముంబాయికి వెళ్లే ందుకు రెడీ అవుతుండగా అర్థరాత్రి ఒంటి గంటన్నర సమయంలో పట్టు బడ్డాడు. కాగా ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఓంప్రకాష్‌ను చేర్చారు. అతనిపై రాజస్తాన్‌లో ఇదివరకే అనేక కేసులున్నాయి. ఇతని కోసం గాలింపు చేబట్టారు. కాగా పట్టుబడ్డ శివరతన్‌ను రిమాండుకు తరలించారు.

ఓటు చోరీపై ఢిల్లీకి తెలంగాణ స్వరం

రామ్‌లీలా మైదానంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: దేశవ్యాప్తం గా బిజెపి పాలనపై వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఓట్‌చోరీ అంశంపై బలమైన గొంతు వినిపిం చేందుకు తెలంగాణ ప్రజలు వచ్చి నిరసన తెలుపుతున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, ప్రజా స్వామ్య పరిరక్షణ అంశాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిం చనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఢిల్లీకి చేరుకున్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరిన మంత్రి రాత్రి ఢిల్లీలోని హోటల్‌లో బస చేశారు. ఆదివారం రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కవ్వం పల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్‌తోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తున్నారని తెలిపారు. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల జాబితాల్లో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వా సాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎన్నికల వ్యవస్థ స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడటం కోసం ఢిల్లీలో జరిగే ఈ పోరాటంలో తెలంగాణ కాంగ్రెస్ తరఫున తమ గళాన్ని బలంగా వినిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

చౌటుప్పల్‌లో దారుణ హత్య

జోగిని సుధాకర్‌ను హతమార్చి బంగారం, నగదు దోపిడీ

మామ ఇంటికే వచ్చి హత్యకు పాల్పడిన శిష్యులపై అనుమానాలు

జిపిఎస్ ఆధారంగా బోధన్‌లో ఇద్దరు నిందితులు పట్టుబడినట్లు సమాచారం

చౌటుప్పల్, నవంబరు 1 ప్రభాతవార్త: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని బీసీ కాలనీలో శనివారం అర్ధరాత్రి దారుణ హత్య చోటుచేసుకుంది. జోగినిగా, శివసత్తుగా ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన రాళ్లబండి సుధాకర్‌స్వామి(50)ను దుండగులు దారుణంగా హత మార్చి, భారీగా బంగారు ఆభర ణాలు, నగదుతోపాటు కారును అపహ రించారు. కళ్లలో పెప్పర్‌స్ప్రే కొట్టి, చేతులు, కాళ్లను చీరలతో కట్టేసి హత్య చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అపహరణకు గురైన వాహనం జీపీ ఎస్ ఆధారంగా నిజామాబాద్ జిల్లా బోధన్ పరిధిలో ఇద్దరు అనుమా నితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడి మేనల్లుడు గుర్రం సురేష్(29) తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన తనను మేనమామ సుధాకర్ పెంచి పోషిం చాడు. దేవుడి పూజలు, కొలుపులు నిర్వహిస్తూ జీవనం సాగించే సుధా కర్‌కు భక్తులు నగదు, బంగారు ఆభరణాలు సమర్పించేవారు. శనివారం సాయంత్రం మేనమామ ఇంటికి భార్యతో కలిసి వెళ్లిన సురేష్ రాత్రి 9.30 గంటల వరకు మాట్లాడి తిరిగి ఇంటికివెళ్లాడు. రాత్రి 11 గంటలకు ఫోన్ చేయగా పవన్, అతని స్నేహితుడు హర్ష తన వద్దకు వచ్చారని, వారితో మాట్లాడిన అనంతరం నిద్రపోతానని సుధాకర్ చెప్పినట్లు సురేష్ తెలి పాడు. అర్ధరాత్రి 12.38 గంటల సమయంలో సుధాకర్ మొబైల్ నుంచి సురేష్‌కు రెండు వాట్సాప్ వాయిస్ సందేశాలు వచ్చాయి. అనుమానం వచ్చిన సురేష్ మేనమామ ఇంటి సీసీ కెమెరాలను పరిశీలించగా అవి పనిచేయలేదు. ఇంటి గేటు, మెష్ డోర్ తెరిచి ఉండటంతోపాటు బయట పార్క్ చేసిన టాటా సఫారీ కారు కనిపించకపోవడంతో వెంటనే 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. మొదటి అంతస్తులోని బెడ్‌రూమ్‌లో మం చంపై బోర్లా పడి ఉన్న సుధాకర్ చేతులు, కాళ్లు కట్టివేసి, రక్తపు మర కలతో మృతి చెంది



జోగిని సుధాకర్ (ఫైల్)

ఉండటాన్ని గుర్తించారు. 70 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, రూ.9 లక్షల నగదు, ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్‌తోపాటు టాటా సఫారీ కారును దుండగులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్, హర్షపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి మేనల్లుడు ఫిర్యాదు చేయడంతో చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, చౌటుప్పల్ డిఎస్పీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. క్లూస్ బృందం ఆధారాలు సేకరించింది. నిందితులు అసోంకు చెందినవారని, కొంతకాలంగా సుధాకర్ వద్ద శిష్యులుగా ఉంటున్నారని బంధువులు తెలిపినట్లు సమాచారం. అపహరణకు గురైన వాహనం జిపిఎస్ ఆధారంగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

హరీశ్‌రావుపై పంజాగుట్టలో నమోదైన కేసు సిద్దిపేటకు బదలీ

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుతో సంబంధం లేకుండా మాజీ బిఆర్ఎస్ మాజీ నాయకుడు చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు మేరకు బిఆర్ఎస్ నేత మాజీమంత్రి హరీశ్ రావుపై పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును పోలీసులు సిద్దిపేట కమిషనరేట్‌కు బదలీ చేశారు. పట్టణంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు ఈ కేసును బదిలీ చేశారు. ఈ మేరకు పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024 డిసెంబరు ఒకటవ తేదీన నమోదైన ఈ కేసును సిద్దిపేట్‌కు బదిలీ చేయ డంతో పాటు అదనంగా నాటి ఐపిసి 419, 420, 467, 406 సెక్షన్లతో పాటు ఐటి చట్టంలోని 66సి, 66డిని చేర్చారు. ఈ కేసులో హరీష్ రావు ఎ1గానూ మాజీ డిసిపి రాధాకిషన్ రావు ఎ2గానూ వున్నారు. 2023లో తన ఫోన్‌ను తన భార్య ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేయడం తెలిసిందే. అప్పట్లో తాను బిఆర్ ఎస్‌లోనే వున్నా తనను అసంతృప్తి నాయకుల జాబితాలో చేర్చి ఫోన్‌లను ట్యాపింగ్ చేశారని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. కాగా పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఈ కేసు ఏడాదిన్నర క్రితం హైకోర్టు ఆదేశాల మేరకు మూసి వేయడం గమనార్హం.

సైబర్ నేరాలపై ముగిసిన అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించేందుకు సాయంత్రం వేళల్లో నెల రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) నిర్వహించిన ఫ్లాష్ వాక్ శనివారం రాత్రి ముగిసింది. అక్టోబరు 1న మొదలైన ఈ కార్యక్రమం నెల రోజులపాటు అన్ని జిల్లాలలో సాగింది. సైబర్ నేరాల నివారణలో నిరంతర ప్రజాఅవగాహన, సమష్టి అప్రమత్తత, సత్వర ఫిర్యాదుల ప్రాముఖ్యతను ఈ అవగాహన కార్యక్రమాల్లో టిజిసిఎస్‌బి అధికారులు ఆయా ప్రాంతాల ప్రజ లకు వివరించారు. కొత్తగా వెలుగులోకి వస్తున్న సైబర్ ముప్పులు, మోసాల ఎత్తుగడలు, సురక్షి త డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ అవగాహన కార్యక్రమాలను దోహదం చేశాయని టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు ఇకముందు యేడాది పొడవునా అన్ని పోలీస్ యూనిట్ల భాగస్వామ్యంతో నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

బాన్సువాడలో నాటు బాంబులు పేలి ఏడుగురికి గాయాలు

క్షతగాత్రుల్లో తండ్రి, ఇద్దరు చిన్నారులు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: కామారెడ్డి జిల్లా బాన్సు వాడ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం అడవి పందులను వేటాడేందుకు తెచ్చి న నాటు బాంబులను కొందరు యాచకులు పరిశీలిస్తుండగా ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో బాంబులు పేలడంతో ఏడుగురు గాయపడ్డారు. ఇందులో నలుగురు తీవ్రంగా గాయపడడంతో వారిని వెంటనే నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. వివరాలు ఇలా వున్నాయి. బాన్సు వాడలో ని ఎర్రమన్నుకుచ్చ కాలనీ లో నివసించే కొందరు యాచకులు సమీపంలోని అడవుల్లో పందులను వేటాడేందుకు తరచూ అక్రమంగా నాటు బాం బులను వాడుతుంటారు.



బాన్సు వాడలో నాటుబాంబులు పేలిన ప్రాంతంలో ధ్వంసమైన బైక్

ఈ నాటు బాంబులను వారు ఎక్కడి నుంచి తెస్తారనేది ఎవరికి తెలియదు. ఆదివారం నాడు కూడా ఇదే విధంగా పెద్ద సంఖ్యలో నాటు బాంబులను ఇక్కడి యాచకులు తెచ్చారు. వీటిని మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో కాలనీలోని ఒకచోట పరిశీలి స్తుండగా అందులో కొన్ని ఒక్కసారిగా పేలాయి. ఈ పేలుడు ధాటికి సమీపంలోని ఒక మోటార్ సైకిల్ పూర్తిగా ధ్వంసం కాగా మరొకటి స్వల్ప ంగా దెబ్బతింది. కాగా పేలుడు ధాటికి రమేష్ (25)తో పాటు రాజు (35) అతని కుమార్తెలు శ్రీదేవి (7), అంజలి (6)లు తీవ్రంగా గాయపడ్డారు . వీరికి మొదట స్థానిక ఆసుపత్రిలో వైద్యం అందించి వెంటనే నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా ఇదే ఘటనలో మరో ముగ్గు రు గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన వెంటనే బాన్సు వాడ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులకు సహాయం అం దించారు. ఘటనా స్థలంలో పేలకుండా వున్న మరికొన్ని నాటుబాంబులను స్వాధీనం చేసుకున్నారు. ఈ బాంబులను ఎవరు తీసుకు వచ్చారు? ఎవరి వద్ద కొన్నారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేబట్టారు. దీనిపై బాన్సు వాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీలో ర్యాలీల హోరు

అటు ఎన్డీయే, ఇటు ఇండియా కూటమి పోటాపోటీగా వీధుల్లోకి

జనసంద్రంలా మారిన రాజధాని

న్యూఢిల్లీ, నవంబరు 1: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. ప్రతిపక్ష ఇండియా కూటమి, అధికార బీజేపీ ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో భారీ నిరసన కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. ఒకవైపు ఎన్నికల జాబితా సవరణలో అక్రమాలు జరిగాయంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి చలో ఢిల్లీ ర్యాలీ నిర్వహిస్తోంది. మరోవైపు 1984లో జరిగిన సిక్కుల వ్యతిరేక అల్లర్ల బాధితులకు నివాళులర్పిస్తూ బీజేపీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ రెండు కార్యక్రమాలతో ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కూటమి రాంలీలా మైదాన్‌లో భారీ ర్యాలీ ప్రారంభించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఇండియాకూటమికి చెందిన ఎంపీలు ఉదయం 11 గంటలకు కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వద్ద సమావేశం అయ్యారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మింట్ రోడ్ కనాట్ ప్లేస్ జంక్షన్ నుంచి రాంలీలా మైదాన్ వరకు మార్చ్ నిర్వహించారు. మరోవైపు బిజెపి ఇండియా కూటమి ర్యాలీకి ధీటుగా మార్చ్ నిర్వహించింది. వ్యతిరేక అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన బాధితులకు నివాళులర్పించేందుకు పశ్చిమ ఢిల్లీలోని హరి నగర్ నుంచి తిలక్ నగర్ వరకు మార్చ్ నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, బీజేపీ నాయకుడు మంజిందర్ సింగ్ సిర్సా నాయకత్వం వహించారు. ఆదివారం ఉదయం 11:30 గంటలకు హరి నగర్ బస్ డిపో నుంచి తిలక్ నగర్ మెట్రో స్టేషన్ వరకు ఈ మార్చ్ జరగనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, సర్దార్ హెచ్.ఎస్. ఫూల్కా, మంజిందర్ సింగ్ సిర్సా, ఎంపీ బాన్సురి స్వరాజ్‌తో పాటు సిక్కు సమాజానికి చెందిన పలువురు పాల్గొ న్నారు. 1984 నవంబర్ 1న జరిగిన సిక్కుల వ్యతిరేక అల్లర్లలో అమాయకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ రాజకీయ పునరాగమనానికి ప్రయత్నించే ముందు సిక్కు సమాజానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్యానించారు.

ఏమైనా సాధించడానికి మీ వద్ద సమయం అంటూ ఉండదు. అందుకే సమయాన్ని కల్పించుకోవాల్సి ఉంటుంది.

న- చార్లెస్ బక్స్టన్

'అండ' విలాపం!


అండ పిండ బ్రహ్మాండాల కలయిక మానవ దేహం. దేహ ఆరోగ్యం సందేహాస్పదమైనపుడు దేహంలోని ఏ అవయవాన్నయినా దానం ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారిది పెద్ద మనసుగా చెప్పుకోవచ్చు. కానీ పేదరికాన్ని ఆసరాగా తీసుకుని స్త్రీ మూర్తుల దేహంత భాగమైన అండాలను అమ్ముకోవలసిన దుస్థితి రావడమే దుర్భరం. వాటి మీద కూడా వ్యాపారం చేయడం దుర్మార్గం అనే చెప్పాలి. అలాంటి దుర్దశకు ఇప్పుడు ఉభయ రాష్ట్రాలు ప్రధాన కేంద్రాలయ్యాయి. మానవ పునరుత్పత్తి వ్యవస్థను వ్యాపార వస్తువుగా మార్చుతున్న మాఫియా ఒకటి ఇప్పుడు గుట్టు రట్టయ్యింది. సంతానోత్పత్తికి ఉపయోగపడాల్సిన జీవకణాలు మహిళల ఓవరీలు, పురుషుల స్పెర్మ్‌ను అక్రమ వ్యాపారానికి సాధనాలుగా మారుస్తున్న ముఠా అది. హైదరాబాద్‌లో తాజాగా వెలుగులోకి వచ్చిన అక్రమ అండాల సేకరణ, పురుషుల వీర్యకణాల అక్రమ విక్రయ వ్యవహారం కేవలం పోలీసు కేసుగా చూడాల్సిన అంశం కాదు. ఇది మహిళల శారీరక స్వేచ్ఛ, ఆరోగ్య భద్రత, పేదరికం, వైద్యరంగ నైతికత, ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థల పనితీరుకు సంబంధించిన తీవ్రమైన సామాజిక సమస్యగా కనబడుతోంది.2026 అక్టోబరు 30,31 తేదీల్లో హైదరాబాద్‌లోని బేగంపేట, ప్రకాశ్‌నగర్, ఎర్రగడ్డ, సరూర్ నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన పోలీసు దాడుల్లో 43 మంది మహిళలను రక్షించి, తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వెలువడిన వార్తా కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకొచ్చి, ఒక్కో అండదాన చక్రానికి రూ.20 వేలు నుంచి రూ.30 వేలు వరకు చెల్లిస్తామని ఆశ చూపినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు ఐవిఎఫ్ వంటి ఆధునిక వైద్య విధానాలు ఆశాకిరణంగా నిలుస్తున్నాయి. అండాలు, వీర్యకణాల దానం ద్వారా అనేక కుటుంబాలకు సంతానం కలిగే అవకాశం ఏర్పడుతోంది. అయితే ఈ వైద్య అవసరాన్ని ఆసరాగా చేసుకుని మధ్యవర్తులు, ఏజెంట్లు, అక్రమ నిర్వాహకులు డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తే అది వైద్య సేవ కాదు. మానవ శరీర భాగాల దుర్వినియోగం. ముఖ్యంగా పేదరికంతో బాధపడుతున్న మహిళలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి, హాస్టళ్లలో ఉంచి, హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాల సేకరణ ప్రక్రియకు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు అత్యంత ఆందోళన కరం. మహిళలను ఇతర రాష్ట్రాల నుంచి గుర్తించి హైదరాబాద్‌కు తీసుకురావడం, ప్రయాణం, వసతి, వైద్య కేంద్రాలతో సంబంధాలు ఏర్పాటు చేయడం వంటి పనులకు ప్రత్యేక ఏజెంట్లు ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. మహిళలకు ఆర్థిక లబ్ధి కలిగిస్తామని ఆశ పెట్టి జీవ కణాలు విక్రయాలకు పురికొల్పడం మంచి పద్ధతి కాదు. హార్మోన్ ఇంజెక్షన్లు, మందులు, వైద్య సామగ్రి స్వాధీనం కావడం, అనధికార వైద్య పర్యవేక్షణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో వైద్య పర్యవేక్షణ లోపాలపై అను మానాలు వ్యక్తమయ్యాయి. హైదరాబాద్‌లోని సుమారు 23 ఐవీఎఫ్ కేంద్రాలతో సంబంధాలు ఉన్నాయనే అంశంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. దాదాపు రెండేళ్లుగా ఈ నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు అనుమానాలుంటే సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ముందుగా ఎందుకు గుర్తించలేకపోయారు? అనేది ఆలోచించవలసి ఉంది. 2025లో హైదరాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు సంబంధించిన వివాదం వెలుగులోకి వచ్చింది. 2026 జూన్‌లో మహారాష్ట్రలో ఒక మహిళ పలుమార్లు అండదానం చేసినట్లు ఆరోపణలు వచ్చిన మరో అక్రమ ఫెర్టిలిటీ నెట్‌వర్క్ ప్రచురించింది. ఒక మహిళ 45 సార్లు అండదానం చేసినట్లు వచ్చిన ఆరోపణలు ఈ రంగంలో పర్యవేక్షణ ఎంత కీలకమో తెలియజేస్తున్నాయి. సంస్కృతి, నైతిక విలువలు ఉన్న మన సమాజంలో జీవకణాల సృష్టిని ఒక మార్కెట్ సరుకుగా మార్చేయడం అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం. సంతానలేమితో బాధపడుతున్న దంపతుల బలహీనతలను, ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, యువకుల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని ఈ దళారీ ముఠాలు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నాయి. అండాల సేకరణ కోసం మహిళలకు పరిమితికి మించిన హార్మోన్ల ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల వారి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతోంది. భారత ప్రభుత్వం తెచ్చిన అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ నియంత్రణ చట్టం 2021 ,సరోగసీ నియంత్రణ చట్టం ప్రకారం వాణిజ్యపరమైన అండాలు, వీర్యకణాల విక్రయం తీవ్రమైన నేరం. ఉన్నత చట్టాలు ఉన్నప్పటికీ, ఏజెంట్లు ఐవీఎఫ్ సెంటర్లు, ఏఆర్టీ బ్యాంకుల యాజమాన్యాలతో చేతులు కలిపి దొడ్డిదారిన వ్యాపారం నడుపుతున్నారు. పేద ప్రాంతాల నుండి మహిళలను అధిక డబ్బు ఎరగా చూపి ఒకే చోట బంధించి, పదే పదే వారి శరీరం నుండి అండాలు సేకరిస్తున్నారు. ఇది ఆధునిక కాలపు వ్యాపారం, లేదా మానవ అక్రమ రవాణా కన్నా తక్కువేమీ కాదు. జీవాన్ని సృష్టించే జీవకణాలను బజారులో కూరగాయల తరహాలో విక్రయించడం మానవ హక్కుల తీవ్రమైన ఉల్లంఘన. వైద్య వృత్తిలో ఉండాల్సిన నైతిక విలువలు కనుమరుగై, కేవలం లాభాపేక్ష మాత్రమే ధ్యేయంగా కొందరు వైద్యులు, బయోబ్యాంకుల నిర్వాహకులు వ్యవహరించడం శోచనీయం.. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళల్లో తమ శరీరాలను ఇటువంటి అక్రమ ప్రక్రియలకు గురిచేస్తే వచ్చే క్యాన్సర్, మాతృత్వ లోపం, ప్రాణాపాయాల గురించి ఆరోగ్య కార్యకర్తలు ద్వారా విస్తృత అవగాహన కల్పించాలి. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇలాంటి ఉచ్చులో పడకుండా మహిళలకు స్వయం ఉపాధి పథకాలు, ఆర్థిక స్వావలంబన కల్పించాలి.

చెప్పడానికి ఏమీ లేనప్పుడు, మాటల తొడుగు తొడగకుండా, గైర్‌హాజర్ కాగల వ్యక్తి నిజంగా ధన్యుడు.



జార్జి ఎలియట్

అలవాట్లు మనం ఉపయోగించే చేతికర్ర వలె ఉండాలి. కానీ ఆధారపడే ఊతకర్రగా ఉండకూడదు.



ఎ.జి గార్డెనర్

ప్రజావాక్కు

రైతన్నకు కోలుకోలేని దెబ్బ అర్నబ్

నెలలతరబడి ఆరుగాలం శ్రమించి,అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు 'అర్నబ్ తుఫాను' తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట చేతికందే సమయంలో ఈతీవ్ర తుఫాను అన్నదాతల ఆశలను చిదిమేసింది.బలమైనఈదురుగాలులు,ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి, తణుకు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది హెక్టార్లలో వరి పంట నేలకొరిగింది. మరో వారం పది రోజుల్లో కోతలు ప్రారంభించి పండించిన ధాన్యాన్ని ఇంటికి చేర్చుకోవాలనుకున్న రైతుల, కళ్ళముందే పంట నేలపాలు కావడంతో దిక్కు తోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట చేతికొచ్చేసమయానికి ఎదురైన ఈవిపత్తునుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వ సహకారం అత్యవసరం.

- దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

గ్రామ సభ సమాచారం ఇవ్వాలి

రాష్ట్రంలో చాలా గ్రామాల్లో అధికారులు గ్రామ సభ నిర్వహణ తేదీ,సమయం, వేదికపట్ల అకస్మాత్తుగా సమాచారం ఇవ్వడం పట్ల చదువుకున్న యువత,ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామ సభ నిర్వహించే రెండు రోజులు ముందుగానే గ్రామ ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. పారదర్శకతతో కూడిన సమాచారం ఇస్తేనే గ్రామ యువత, ప్రజలు వాళ్ల సమస్యల పట్ల, గ్రామ సమస్యల పట్ల ప్రశ్నించే అవకాశం ఉంటుంది. గ్రామ సభ పాలకవర్గం కొరకు కాదు కదా గ్రామ ప్రజల కోసం అనేది గ్రహించాలి. కొన్ని గ్రామాలలో ఆరు నెలల నుండి గ్రామ సభలు నిర్వహించకపోవడం గమన్హారం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

ప్రణాళిక రూపొందించుకోవాలి

ఏల్‌నీనో మనకు మంచే చేసింది.ఒకటి పంటల వైవిధ్యం వైపు అడుగులు వేసే విధంగా చేసింది. అలాగే తక్కువ నీటితో కూడా రైతుఫలితాలు పొందొచ్చు అనేనిజం రాబోయే రోజులలో నిజంకాబోతున్నది.అయితే దీని వెనుకాల మూలస్తంభం లాగా నిలబడ్డ ఒకే ఒక పథకం విబిజీ రామ్‌జీ మాత్రమే. ఇది గ్రామీణ ఆర్థికవ్యవస్థను స్థిరీకరించడంలో ప్రధాన కారణం. అది కోవిడ్ అయినా ఏల్‌నీనో అయినా సంక్షోభం ఏదైనా సమాధానం మాత్రం ఉపాధి హామీ మాత్రమే. అయితే సంక్షేమం మీద ఉచితాల మీద చాలా చర్చ జరుగుతుంది. ఈ పథకం ద్వారా వచ్చేలబ్ధి ఏదైతే ఉందో అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తి.

- భారత అవినాష్, జనగామ

పునరుద్ధరించాలి

ఇటీవల రైల్వేశాఖ అభివృద్ధిలో భాగంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తుంది. సామాన్యులకు ప్రయాణం ఓ ఆశాజ్యోతి. పొగబండి ప్రస్థానం చాలా ఆసక్తికరం. ప్రయాణికులను ఆకర్షించడంలో ఎల్లప్పుడూ ముందుంటుదంటే అతిశయోక్తికాదు.ఇకపండుగలు,పబ్బాలు,వారంతం సమయంలో అధికరద్దీఉంటుంది. అదనపు రైళ్లు, జనరల్ బోగీలతో నడిపిస్తున్నాకూడా రద్దీ తగ్గడంలేదు. ఈ అంశంపై మరోసారి దృష్టి సారించాలి.అన్నిటికంటే ముఖ్యంగా ప్యాసింజర్స్‌ని సురక్షితంగా చేర్చడమే ముఖ్యం. కోవిడ్ కాలంలో రద్దయిన సీనియర్ సిటిజన్‌టికెట్‌లోరాయితీలు ఇంతవరకూ పునరుద్ధరించలేదు. సంబంధిత అధికారులుత్వరలో తీపికబురు అందించ గలరు.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

కాలాన్ని వృధా చేయొద్దు

సాధారణంగా కొందరు పనిలేనివారు, వెళ్తున్న వారిని ఆపి, వాళ్ల వ్యక్తిగత విషయాలను అడిగి తెలుసుకుంటూ కాలాన్ని వృధా చేస్తుంటారు.అసందర్భపు, అప్రస్తుప్రస్తుత సంభాషణలతో అమూల్యమైన సమయాన్ని కేవలం కాలక్షేపం కోసం వృధా చేయడం అంత మంచిది కాదు. అవసరమైన మాటలు మాట్లాడుకుంటే ఉపయోగమేకాని,అనవసరమైన మా టలతో ఎంతో విలువైనకాలాన్ని వృధాచేయడంమూర్ఖత్వమే అవుతుంది. డబ్బుపోయినా, ఆస్తులుపోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ గడిచిపోయిన కాలం మాత్రం తిరిగి రాదని గుర్తుంచుకోవాలి.అందుకే కాలాన్ని అనవసరమైన మాటలతో వృధా చేయకుండా సక్రమంగా సద్వినియోగం చేసుకోవడం నేర్చుకోవాలి. కాలం విలువ తెలుసుకున్న వారే చక్కగా వృద్ధిలోకి వస్తారు. కాలాన్ని వృధా చేసేవారు జీవితంలో నిరర్థకంగా మిగిలిపోతారు.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

అన్నదాతకు భరోసా కల్పించాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్నకష్టాలు వర్ణనాతీతం.అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికి ఆజ్యంపోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీద తాటికాయపడినట్లు ఈయేడాది రుతుపవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం వల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. మొత్తం దేశం సాగుకు గుదిబండ దాంతో అప్పుల బాధతో ఆగని ఆత్మహత్యలు.

-కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

టిటిడికి రాజకీయ రహిత పాలకమండలి అవసరం!

గత పాలకమండలి ప్రారంభించిన అవసరమైన అభివృద్ధిపనులు కొత్తబోర్డు వచ్చినంత మాత్రాన నిలిచిపోకూడదు. సంస్థకు సంబంధించిన విధానాలువ్యక్తుల మార్పుతో మారకుండా వ్యవస్థాగతంగా కొనసాగాలి. టీటీడీ కూడా తన ధార్మిక బాధ్యతలతోపాటు విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించాలి. ఈ కార్యక్రమాల ఫలితాలు, వాటికి ఖర్చుచేసిన నిధుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. వ్యక్తుల మార్పుకంటే వ్యవస్థలో మెరుగుదల ముఖ్యం. పాలకమండలి మారినా భక్తుల సేవ, ఆలయ సంప్రదాయాల పరిరక్షణ, పారదర్శకత అనేలక్ష్యాలు మారకూడదు. ప్రభుత్వాలు మారుతుంటాయి. రాజకీయ నాయకత్వం మారుతుంది. కానీ తిరుమలపై భక్తుల విశ్వాసం తరతరాలుగా కొనసాగుతుంది. ఆ విశ్వాసాన్ని కాపాడే బాధ్యత పాలకమండలిపై ఉంది.



అప్పన్న గొనప

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కొత్త ధర్మకర్తల మండలి ఏర్పాటుపై ఇప్పుడు చర్చమొదలైంది. 2024 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 243 ద్వారా ప్రస్తుత పాలకమండలి ఏర్పాటైంది. బి.ఆర్.నాయుడు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత బోర్డులో ఎమ్మెల్యేలు, రాజకీయ నేపథ్యం ఉన్నవారితో పాటు వివిధ రంగాలకు చెందిన సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో తదుపరి బోర్డు కూర్పుపై రాజకీయ, ఆధ్యాత్మిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది. టీటీడీ అనేది సాధారణ ప్రభుత్వ సంస్థ కాదు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం, శ్రీవారి ఆలయ పవిత్రత, ధార్మిక సంప్రదాయాలు, వేల కోట్ల రూపాయల ఆస్తులు, భక్తుల కానుకలతో ముడిపడిన అత్యంత కీలకమైన వ్యవస్థ. అందువల్ల కొత్త పాలకమండలి ఎంపికను కేవలం రాజకీయ నియామకాల కోణంలో కాకుండా, సంస్థ భవిష్యత్తు, భక్తుల ప్రయోజనాలు, పరిపాలనా సామర్థ్యం కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత టీటీడీ పాలకమండలిలో ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యం ఉండటం, వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యులు ఉండటం అధికారికంగా కనిపిస్తున్నఅంశం. అయితే,రాబోయే పాలకమండలి ఎంపికలో రాజకీయ ప్రాతినిధ్యానికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి? ఆధ్యాత్మిక పరిజ్ఞానం, పరిపాలనా అనుభవం, సేవాభావం కలిగిన వ్యక్తులకు ఎంత స్థానం కల్పించాలి? అనే ప్రశ్నలు సహజంగానే ముందుకు వస్తున్నాయి. ఎమ్మెల్యేలు,ఎంపీలు, రాజకీయ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులకు ప్రజాసేవ చేయడానికి ఇప్పటికే అనేక అవకాశాలు ఉన్నాయి. అలాంటి వారికే మరోసారి టీటీడీ పాలకమండలిలో ప్రాధాన్యతకల్పించాలా? లేక ఆలయ సంప్రదాయాలు తెలిసిన ధార్మిక పండితులు, ఆర్థిక నిర్వహణ నిపుణులు, పరిపాలనా అనుభవం ఉన్నవారు, సామాజిక సేవకులు, నిజమైన భక్తులకు కూడా తగిన అవకాశం కల్పించాలా?అన్నది ప్రభుత్వం ఆలోచించాల్సిన అంశం. టీటీడీ చైర్మన్ పదవి, ధర్మకర్తల సభ్యత్వం రాజకీయ ప్రాధాన్యతను ప్రదర్శించే వేదికగా మారకుండా చూడాలి. ఏప్రభుత్వం అధికారంలోఉన్నా, ఈ నియామకాల్లో వ్యక్తుల రాజకీయ అనుబంధం కంటే వారి అర్హత,సేవా నేపథ్యం, నిజాయితీ, బాధ్యతాయుతమైన పనితీరుకుప్రాధాన్యత ఇవ్వాలి. ఇది ప్రస్తుత చైర్మన్ లేదా ప్రస్తుత పాలక మండలిని వ్యక్తిగతంగా విమర్శించే అంశంకాదు. భవిష్యత్తులో ఏర్పడే ప్రతి పాలకమండలికి వర్తించాల్సిన విధానపరమైన సూచన. కొత్త బోర్డులో ధార్మిక రంగానికి చెందిన ప్రముఖులు, ఆలయ పరిపాలనపై అవగాహన ఉన్నవారు, ఆర్థిక నిపుణులు, సామాజిక సేవకులు, మహిళలు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులకు తగిన ప్రాతినిధ్యంకల్పించాలి. సభ్యుల సంఖ్య కంటే వారి పనితీరు, బాధ్యతల నిర్వహణ ముఖ్యం.ప్రతి సభ్యుడికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించి,వాటి అమలుపై సమీక్ష చేసే విధానం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలకమండలిని ఏర్పాటు చేసేటప్పుడు రాజకీయ సమీకరణాలతో పాటు టీటీడీ సంస్థాగత అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. శ్రీవారి సేవకు అంకితమయ్యే వ్యక్తులకు అవకాశం కల్పించడం ద్వారా పాలకమండలి పట్ల భక్తుల్లో విశ్వాసం పెరుగుతుంది. తిరుమలకు వచ్చేసామాన్య భక్తుడికి శ్రీవారి దర్శనంఅత్యంత ముఖ్యమైనది. కుటుంబంతో కలిసిఎన్నో వ్యయప్రయాసలు భరించి, దూర ప్రాంతాల నుంచి తిరుమలకు చేరుకునే భక్తుడికి ప్రశాంతంగా దర్శనం కలగాలి. అయితే, వీఐపీ దర్శనాలు, సిఫార్సు లేఖలు,



ప్రత్యేక ప్రాధాన్యతల కారణంగా సాధారణ భక్తుల దర్శన సమయంపై ప్రభావం పడుతోందన్న అభిప్రాయాలు తరచూ వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారులు, ప్రముఖులకు నిబంధనల ప్రకారం కల్పించే దర్శన సౌకర్యాలపై అభ్యంతరం అవసరంలేదు. కానీ ఆసౌకర్యాల వల్లసామాన్య భక్తుడి దర్శనం ఆలస్యం కాకుండా చూడటం పాలకమండలి ప్రధాన బాధ్యత కావాలి. సిఫార్సు లేఖల వినియోగం, ప్రత్యేక దర్శనాల కేటాయింపు, ప్రోటోకాల్ దర్శనాల నిర్వహణపై స్పష్టమైన విధానం ఉండాలి. ఆవిధానం అమలులో పారదర్శకత ఉండాలి. ఆన్‌లైన్ దర్శన టికెట్ల విషయంలోనూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. టికెట్లు విడుదల చేసే సమయం, అందుబాటులో ఉన్నటికెట్ల వివరాలు, బుకింగ్ విధానం స్పష్టంగా తెలియజేయాలి. ఒకేవ్యక్తి వివిధ పేర్లతో టికెట్లు పొందడం,దళారుల ప్రమేయం, నకిలీబుకింగ్‌లు, అధిక ధరలకు టికెట్లు విక్రయించే ప్రయత్నాలను అరికట్టాలి. ఆన్‌లైన్ టికెట్లు సామాన్య భక్తుడికి సులభంగాఅందుబాటులో ఉండేలా సాంకేతిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ఇప్పటికే టీటీడీ వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు, అన్నప్రసాదం, వసతి వంటి అనేక సేవలను నిర్వహిస్తోంది. వాటిని కొత్తగా ప్రకటించడంకంటే, ప్రస్తుతం అమలవుతున్న సేవల్లో ఎక్కడైనా లోపాలు ఉన్నాయా? భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అనే అంశాలపై దృష్టిపెట్టాలి. క్యూలైన్లలో వేచిఉండే సమయం, రద్దీనియంత్రణ, తాగునీరు, పారిశుద్ధం, వసతి, రవాణా వంటి అంశాల్లో భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. టీటీడీకి వచ్చే ప్రతి కానుక, ప్రతి విరాళం భక్తుల విశ్వాసానికి ప్రతీక. అందువల్ల నిధుల వినియోగంలో అత్యున్నత స్థాయి పారదర్శకత ఉండాలి.ఆలయ నిర్వహణ, ధార్మిక కార్యక్రమాలు, భక్తుల సౌకర్యాలు,విద్య, వైద్యం, సామాజిక సేవ వంటిరంగాల్లో నిధులు ఎలా వినియోగిస్తున్నారనే వివరాలు భక్తులకు స్పష్టంగా అందుబాటులో ఉండాలి. రాష్ట్ర ఆర్థికపరిస్థితులు,ప్రజలపై ఉన్నసంక్షేమ బాధ్యతలు, వ్యవసాయరంగంలో నెలకొన్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వసంస్థలన్నీ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉంది. టీటీడీకి స్వతంత్ర ఆదాయ వనరులు, విరాళాలు ఉన్నప్పటికీ,వాటి వినియోగంవిషయంలో బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. టెండర్లు, కాంట్రాక్టులు, కొనుగోళ్లు, నిర్మాణ పనుల విషయంలో నాణ్యత, ఖర్చు, నిబంధనల అమలుపై కఠినమైన పర్యవేక్షణఉండాలి. పాలకమండలి సమావేశాల్లో తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలు, అభివృద్ధి పనుల పురోగతి, నిధుల వినియోగం వంటి వివరాలను సాధ్యమైనంతవరకు ప్రజలకు తెలియజేయాలి. ఏదైనా పనికి ఎంత ఖర్చుచేస్తున్నారు? దాని వల్ల భక్తులకు ఏమి ప్రయోజనం కలుగుతుంది? నిర్ణయం అమలుబాధ్యత ఎవరిది? అనే అంశాలు స్పష్టంగా ఉండాలి. ఫిర్యాదులపై విచారణ, తప్పిదాలపై చర్యలు, ఆడిట్ నివేదికల పరిశీలన వంటి అంశాలు క్రమం తప్పకుండాజరగాలి. కొత్త పాలకమండలి ఏర్పాటులో చైర్మన్ ఎంపికతోపాటు సభ్యుల అర్హతలు, వారి బాధ్యతలు, సంస్థకు వారు అందించగలసేవలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సభ్యులు కేవలం సమావేశాలకుహాజరయ్యే వ్యక్తులుగా కాకుండా,తమకు కేటాయించిన విభాగాల పనితీరును పరిశీలించే బాధ్యతాయుతమైన ప్రతినిధులుగా ఉండాలి. గత పాలకమండలి ప్రారంభించిన అవసరమైన అభివృద్ధిపనులు కొత్తబోర్డు వచ్చినంతమాత్రాన నిలిచిపోకూడదు. సంస్థకు సంబంధించిన విధానాలువ్యక్తుల మార్పుతో మారకుండా వ్యవస్థాగతంగా కొనసాగాలి. టీటీడీ కూడా తన ధార్మిక బాధ్యతలతోపాటు విద్య,వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించాలి. ఈ కార్యక్రమాల ఫలితాలు, వాటికి ఖర్చుచేసిన నిధుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. వ్యక్తుల మార్పు కంటే వ్యవస్థలో మెరుగుదలముఖ్యం.పాలకమండలిమారినా భక్తుల సేవ,ఆలయ సంప్రదాయాల పరిరక్షణ, పారదర్శకత అనేలక్ష్యాలు మారకూడదు. ప్రభుత్వాలు మారుతుంటాయి. రాజకీయ నాయకత్వం మారుతుంది. కానీ తిరుమలపై భక్తుల విశ్వాసం తరతరాలుగా కొనసాగుతుంది. ఆ విశ్వాసాన్ని కాపాడే బాధ్యత పాలకమండలిపై ఉంది. ●

ప్లాస్టిక్ భూతానికి చరమగీతం పాడుదాం

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

ఒకప్పుడు పల్లెల్లో పెళ్లిళ్లు, పండుగలు,జాతరలు, అన్నదానాలు జరిగితే ఇళ్లలోని పాత్రలను సమకూర్చుకొని ఉపయోగించేవారు.ఒకరి ఇంట్లోని పాత్రలు మరొకరి ఇంటి శుభకార్యానికి చేరేవి. వినియోగం పూర్తయ్యాక శుభ్రం చేసి భద్రపరిచేవారు.ఆ సంప్రదాయంలో పొదుపుతోపాటుసామాజిక ఐక్యత, పర్యావరణ పరిరక్షణ కూడా అంతర్లీనంగా ఉండేవి. కానీ నేడుసౌకర్యం పేరుతోఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు,చెంచాలు,సంచులు మన జీవితాల్లో భాగమైపోయాయి. వేడుక ముగుస్తుంది. విందు పూర్తవుతుంది. కానీ ప్లాస్టిక్‌కాలుష్యం మాత్రం ముగియదు! ఒక పెళ్లి వందలాది ప్లేట్లు! ఒక పండుగ వేలాది గ్లాసులు! ఒక సామూహిక కార్యక్రమం కొండంత చెత్త! గాలికి ఎగిరిపొలాల్లో చేరే ప్లాస్టిక్ వ్యర్థాలు,కాలువలను అడ్డుకునే కవర్లు, చెత్తకుప్పల్లో పశువుల ప్రాణాలకు ముప్పుగా మారే సంచులు ఇవన్నీ మన నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనాలు.ప్లాస్టిక్ చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి సూక్ష్మ ప్లాస్టిక్ కణాలుగా మారి నేల, నీరు, గాలిలోకి చేరుతోంది. వీటి దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలపై పరిశోధనలు కొనసాగుతున్నప్పటికీ, ఈ కాలుష్యాన్ని తేలికగా తీసుకోవడానికి వీల్లేదు.ఈ సమస్యకు పరిష్కారంగా ప్రతిగ్రామంలో ప్రజలే స్వచ్ఛందంగా 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేసుకోవాలి. ఇది కేవలం పాత్రల నిల్వకేంద్రం కాదు. ప్లాస్టిక్ వ్యతిరేక ప్రజా ఉద్యమానికి నాంది కావాలి! స్టీల్ బ్యాంక్ అంటే డబ్బుదాచుకునేబ్యాంకు కాదు. గ్రామస్థులంతా కలిసిస్టీల్ ప్లేట్లు,గ్లాసులు,చెంచాలు, గిన్నెలు, వడ్డింపు పాత్రలు సమకూర్చుకొని అవసరమైన కుటుంబాలకు అందించే సామూహిక వ్యవస్థ. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, పండుగలు,అన్నదానాలు, గ్రామసభలు వంటి కార్యక్రమాలకు వీటిని ఉచితంగా లేదానామమాత్రపు నిర్వహణ రుసుముతో అందించవచ్చు. కార్యక్రమం అనంతరం పాత్రలను శుభ్రపరిచి తిరిగి అప్పగించాలి. ఒకసారి చేసిన పెట్టుబడి అనేక కుటుంబాలకు, అనేక కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. కుటుంబాల ఖర్చులుతగ్గుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గుతాయి. పరస్పర సహకారం పెరుగుతుంది.ఈఉద్యమం ఇళ్లకే పరిమితం కాకూడదు. టీ దుకాణాల నుంచి స్టార్ హోటళ్ల వరకు, కిరాణా షాపుల నుంచి మటన్,చికెన్ దుకాణాల వరకు ప్రతివ్యాపారంలోనూప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. టీషాపుల్లో ప్లాస్టిక్ కప్పులకు బదులుగా స్టీల్ గ్లాసులను, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో ఒక్కసారివాడి పారేసే ప్లేట్లకు బదులుగాపునర్వినియోగ పాత్రలనుప్రోత్సహించాలి. కిరాణా దుకాణాలు, కూరగాయలు, పండ్ల మార్కెట్లలో వినియోగదారులు తమ సంచులు తెచ్చుకునేలా అవగాహన కల్పించాలి. బేకరీలు, స్వీట్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, చేపల దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలూ తమవంతు బాధ్యతతీసుకోవాలి. మటన్, చికెన్ దుకాణాల్లో ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణమైన పాత్రలు, ప్యాకేజింగ్ ప్రత్యామ్నాయాలను వినియోగించాలి. వినియోగదారులు సొంత సంచులు, అవసరమైన చోట తగిన పునర్వినియోగపాత్రలు తెచ్చుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. అయితే పునర్వినియోగం సాధ్యం కాని ప్రతి వస్తువుకూ స్టీల్‌నే ప్రత్యామ్నాయంగా భావించకుండా, ఆహార భద్రతకు అనువైన, చట్ట బద్ధమైన ఇతర ప్రత్యామ్నాయాలనూ పరిశీలించాలి. ఒక గ్రామంలో స్టీల్‌బ్యాంక్ ఏర్పాటైతే వందల కుటుంబాలకు ఉపయోగపడుతుంది. వందగ్రామాల్లో ఏర్పాటైతేవేలాది కార్యక్రమాల్లో ప్లాస్టిక్‌వినియోగం తగ్గుతుంది. ఈ ఆలోచన రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తే ప్రజలభాగస్వామ్యంతోపర్యావరణ పరిరక్షణకు కొత్తదారి ఏర్పడుతుంది. ప్రభుత్వం ఆదేశించే వరకు వేచి చూడకుండా ప్రజలే నడుం బిగించాలి. ●

కరవు పరీక్షలో పాలకులు పాసవ్వాలి..



శ్రీశైలం దూడం

పల్లె కన్నీరు పెడుతుందో.. కనిపించని వాన చుక్కల కోసం!బీటలు వారిన భూమిలో విత్తనం విలవిల.. ఎండిన బోర్లతో బిందె పట్టిన తల్లి ఎదురుచూపులు! పంట లేదు.. పని లేదు. పొయ్యిలో పిడికెడు బువ్వ లేదు. అప్పుల బాధతో రైతన్నకు కంటిమీద కునుకు లేదు! చినుకమ్మ రాక కోసం పల్లె ప్రాణంతపిస్తుంటే.. పాలకులారా.. అన్నదాత ఆర్తనాదం ఆలకించరా! ఎండిన పంటకు పరిహారమిచ్చి, దాహంతో అల్లాడే పల్లెకు నీరందించరా! పనులు కోల్పోయిన కూలీలకు ఉపాధి కల్పించి.. రైతు కుటుంబాలకు అండగా నిలవరా! కరవు కాటుకు బలికాకముందే ప్రభుత్వం ఆదుకోవాలి. కన్నీటిపల్లెల్లో మళ్లీ ఆశల వాన కురిపించాలి! ఒకప్పుడు చెరువు నిండితే పల్లె కళకళలాడేది.బావిలో నీరుంటే రైతు ముఖంలో వెలుగు కనిపించేది. నేడుఆకాశం వైపు ఆశగా చూసే అన్నదాతకు వర్షాభావం శాపంగామారుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసంచేసిన అప్పులు ఒకవైపు, పంట చేతికి వస్తుందో లేదోనన్న ఆందోళన మరోవైపు రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వర్షాభావం ప్రకృతి పరిస్థితి కావొచ్చు. కానీ దాని దెబ్బకు ప్రజలు కుంగిపోకుండా కాపాడటం పాలన బాధ్యత. తెలంగాణలో కరవు తీవ్రతను గణాంకాలే వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో 111 మండలాలు తీవ్ర కరవు, 254మండలాలు మధ్యస్థ కరవు బారిన పడ్డాయి. జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 17శాతం లోటు. ఈ కొరత వర్షపు చుక్కల్లోనే కాదు ఎండిన పంటల్లో, తగ్గిన నీటిమట్టాల్లో, పెరిగిన అప్పుల్లో కనిపిస్తోంది. వర్షాభావం సాగు విస్తీర్ణంపైనా ప్రభావం చూపింది. ఖరీఫ్‌లో గతంలో 139.28 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి 126.06 లక్షల ఎకరాలకు తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. వరిసాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57లక్షల ఎకరాలకు పడిపోయింది. ఈ తగ్గుదల వెనుక నీటి కొరతతోపాటు పెట్టుబడి నష్టాల భయాలూ ఉన్నాయి. సాగుచేస్తే పెట్టుబడి తిరిగి వస్తుందనే నమ్మకం లేకపోతే రైతు పొలంలో అడుగు పెట్టడానికే వెనుకాడతాడు. ఎల్‌నినో వంటి సముద్ర- వాతావరణ పరిణామాలు కొన్ని పరిస్థితుల్లో వర్షపాతంపై ప్రభావం చూపగలవు. అయితే తెలంగాణలోని ప్రస్తుత కరవుకు ఎల్‌నినోనే ఏకైక కారణమని నిర్ధారించడం సరికాదు. వర్షపాతం లోటు, ప్రాంతాలవారీ వర్షాల పంపిణీ, జలాశయాల నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, సాగు విధానాలు ఇలా అనేక అంశాలు వ్యవసాయాన్ని ప్రభావితంచేస్తాయి. అందువల్ల ఎల్‌నినో గురించి చర్చించడంతోపాటు, వాతావరణ



అంచనాల ఆధారంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం అత్యవసరం. ప్రకృతి ఎప్పుడు ఎలా మారుతుందో మనిషి నిర్ణయించలేడు. కానీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతును సిద్ధం చేయగలడు. కరవు ప్రభావం పొలంలోనే ఆగిపోదు. పంట చేతికి రాకపోతే రైతు ఆదాయం తగ్గుతుంది. రైతు ఖర్చు చేయలేకపోతే కూలీకి పని ఉండదు. పల్లెల్లో కొనుగోళ్లు తగ్గితే చిన్న వ్యాపారులూ నష్టపోతారు. పశువులకు మేత, నీరు దొరకకపోతే పాడి రైతుల జీవనోపాధి దెబ్బతింటుంది. పిల్లల చదువులు, కుటుంబ వైద్యం, ఇంటి అవసరాలన్నీ ఆర్థిక భారంగా మారతాయి. ఒక పంట నష్టం క్రమంగా కుటుంబ సమస్యగా, అక్కడి నుంచి గ్రామీణ ఆర్థిక సంక్షోభంగా మారుతుంది. అందుకే కరవును వ్యవసాయ శాఖ సమస్యగా మాత్రమే చూడకూడదు. వ్యవసాయం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి శాఖలు సమన్వయంతో పనిచేయాలి. జలాశయాల్లో నీటి నిల్వలూ ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో కలిపి 585టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 179.63 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈపరిస్థితిలో తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికపై రైతులకు ముందస్తు సూచనలు ఇవ్వాలి. తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడంతోపాటు, వాటికి గిట్టుబాటు ధర, కొనుగోలు భరోసా కల్పించాలి. లేకపోతే ప్రత్యామ్నాయ పంట వేయమనే సూచన రైతుకు మరో ఆర్థిక ప్రయోగంగా మిగిలిపోతుంది. ప్రభుత్వం తక్షణం చేపట్టాల్సిన చర్యలలో భాగంగా క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేసి, అర్హులైన రైతులను గుర్తించాలి. అర్హుల జాబితాలను బహిరంగపరిచి, నిబంధనల ప్రకారం సాయం సకాలంలో రైతుల ఖాతాల్లో జమయ్యేలాచూడాలి. ఎండిపోయిన బోర్లు, నీటిఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి, ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటుచేయాలి. వ్యవసాయ పనులు తగ్గిన గ్రామాల్లో ఉపాధి హామీ పనులను అవసరానికి అనుగుణంగా వేగవంతం చేయాలి. మేత కొరత ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాసం, తాగునీటి ఏర్పాట్లపై దృష్టి పెట్టాలి. కరవు నష్టాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, కేంద్రం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరగాపొందేందుకు చర్యలు తీసుకోవాలి. వాతావరణ అంచనాలు, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక, విత్తనాల లభ్యత, గిట్టుబాటు ధరపై ముందస్తు చర్యలు తీసుకోవాలి. కరవు మండలాల ప్రకటన అవసరమైన తొలి అడుగుమాత్రమే. కేంద్రం నుంచిసాయం కోరడం, నష్టాన్ని అంచనా వేయడం ముఖ్యమే. కానీ ఆ సాయం అర్హులైన రైతులకు ఎప్పుడు చేరుతుంది?నీటిఎద్దడి ఉన్న గ్రామాలకు తాగునీరు ఎప్పుడు అందుతుంది? పని కోల్పోయిన కూలీకి ఉపాధి ఎప్పుడు దొరుకుతుంది?ఈప్రశ్నలకు క్షేత్రస్థాయిలో సమాధానాలు కనిపించాలి. పరిహారం కోసం రైతు కార్యాలయాల చుట్టూ తిరిగేపరిస్థితి రాకూడదు. కేంద్రం,రాష్ట్రం బాధ్యతను ఒకరిపైమరొకరు నెట్టకుండా సమన్వయంతో పనిచేయాలి. కరవు వేళ రైతుకు కావాల్సింది ఓదార్పు మాటలు మాత్రమే కాదు. చేతికి సాయం, పొలానికి నీరు, కుటుంబానికి ఉపాధి, పశువులకు మేత, పంటకు గిట్టుబాటు ధర. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో మనిషి నిర్ణయించలేడు. కానీ వర్షాభావం వచ్చినప్పుడు ప్రజల నష్టంతగ్గించే చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల చేతిలోనే ఉంది. కరవు ముందస్తు హెచ్చరికలను కార్యాచరణగా మార్చి,సాయం అర్హుల చేతికి చేర్చి,పల్లె బతుకుల్లో భరోసా కల్పించినప్పుడే పాలన తన పరీక్షలో నెగ్గినట్లు!. ●

ఆ రెండు ఇరాన్ అణు స్థావరాలను

10 నిమిషాల్లో లేపేస్తాం



ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్, నవంబరు 1: ఇరాన్ అణు రంగాన్ని, సైనిక స్థావరాలను గురిచేసి తాము చేపట్టిన దాడుల దాటికి ఆ దేశ బలగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ అణుసామర్థ్యాలను, సైనిక వ్యవస్థలను ఇప్పటికే అమెరికా దళాలు సమర్థవంతంగా ధ్వంసం చేశాయని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఒకటి రెండు కీలక అణు స్థావరాలను కూడా కేవలం 'పది నిమిషాల్లో' నేలమట్టం చేయగల సామర్థ్యం తమ దళాలకు ఉందంటూ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

అణు కేంద్రాలు క్లోజ్.. 10 నిమిషాల వ్యవధిలోనే దెబ్బతీస్తాం

ఇరాన్‌కు చెందిన నౌకాదళం, వాయుసేన,యాంటి-ఎయిర్‌క్రాఫ్ట్‌నెట్‌వర్క్, రక్షణ పరికరాల తయారీ విభాగాలను అమెరికా బలగాలు ఇదివరకే కోలుకోలేని విధంగా దెబ్బతీశాయని ట్రంప్ వివరించారు. అయితే, భూగర్భంలో అత్యంత భద్రంగా ఉండే 'పింక్-యాక్స్ మౌంటైన్' వంటి ప్రధాన కేంద్రాలు సహా ఒకటి రెండు అణు స్థావరాలు మాత్రమే ఇప్పటికీ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని కూడా తుడిచిపెట్టడానికి తమకు ఎక్కువ సమయం పట్టదని, ఆదేశాలు ఇచ్చిన పది నిమిషాల్లోనే ఆ పని పూర్తి చేయగలమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి తదుపరి దాడులు చేయడానికి తమకేమీ అత్యవసరమైన హడావుడి లేదని వెల్లడించారు.

చర్చలకు ఇరాన్ సై.. కానీ నమ్మలేం: ట్రంప్ స్పష్టీకరణ

ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలని భావిస్తోంది. ఆ దిశగా కొన్ని సంకేతాలు వచ్చాయని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ దేశ విశ్వసనీయతపై తమకు ఎంతో అనుమానం ఉందన్నారు. 'ఒప్పందం చేసుకున్నట్టే చేసుకుని, తర్వాత వెనక్కి తగ్గడం ఇరాన్‌కు అలవాటే' అని విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ ఇరాన్ చేతికి అణ్వాయుధం చిక్కే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తిరిగి దాడులు చేసే ఆలోచన ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. అలాంటి విషయాలను బహిరంగంగా వెల్లడించలేనంటూ సమాధానాన్ని దాటవేశారు. మరోవైపు, సైనిక చర్యల ఆందోళనల నడుమ అమెరికా, ఇరాన్ మధ్య దౌత్యపరమైన సంప్రదింపులు కూడా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. జార్జియా వేదికగా జరిగిన జి-20 విదేశాంగ మంత్రుల సదస్సు ముగింపులో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ.. భద్రతాపరమైన హామీలు లభిస్తే దౌత్యపరమైన పరిష్కారానికి అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మధ్యవర్తుల ద్వారా రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు ధ్రువీకరించారు. ఇరాన్ ప్రముఖ భద్రతా అధికారి మొహసేన్ రెజాయ్ కూడా స్పందిస్తూ.. ఖతార్ మధ్యవర్తుల ద్వారా అమెరికా పంపిన లేఖలోని స్వరం మారిందని, తమ వైపు నుంచి ది మంచి సంకేతమని అభిప్రాయపడ్డారు. అయితే ఇరాన్ అత్యున్నత నాయకత్వం మాత్రం అమెరికా, ఇజ్రాయెల్‌లు ఏ చిన్న పొరపాటు చేసిన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

బలవంతంగా దుకాణాలు మూయించారు

కన్నాట్‌ప్లేస్, రామ్‌లీలా పరిస్థితులపై రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ, నవంబరు 1: ఢిల్లీలో వ్యాపారుల నష్టాలపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. ప్రతిపక్ష ఇండియా కూటమి నిర్వహిస్తున్న ర్యాలీతో వ్యాపారాలు దెబ్బతింటాయన్న బీజేపీ ఆరోపణలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో దుకాణాలను బీజేపీ బలవంతంగా మూసివేయించిందని ఆరోపించారు. దీంతో వ్యాపారులకు నష్టం కలిగిస్తున్నదెవరో ప్రజలు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. నేడు నిర్వహిస్తున్న ర్యాలీ సందర్భంగా ఆయన ఈ మేరకు ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ నిర్వహిస్తోంది. పండగల సీజన్‌లో ఈ కార్యక్రమం వల్ల వ్యాపారాలు దెబ్బతింటాయని ఢిల్లీ వ్యాపార సంఘాలు గతంలోనే ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని నవంబర్ 10 తర్వాత నిర్వహించాలని కోరాయి. ర్యాలీకి వచ్చే వారు ఢిల్లీలోని మార్కెట్లలో కొనుగోళ్లు చేయాలని తాము కోరామని రాహుల్ తెలిపారు. అయితే కనాట్ ప్లేస్‌కు వచ్చేసరికి అన్ని దుకాణాలనూ బీజేపీ బలవంతంగా మూసివేయించిందని ఆరోపించారు. వ్యాపారులకు నష్టం ఎలా జరుగుతోందో ప్రజలు గమనించాలని అన్నారు. మరోవైపు, ఢిల్లీ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) వ్యాపారాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. రామ్‌లీలా మైదానం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో సుమారు 3 లక్షల దుకాణాలు ఉండగా, వాటిలో 2.5 లక్షల వరకు మూతపడే అవకాశం ఉందని పేర్కొంది. ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల రాకపోకల్లో అంతరాయాల వల్ల పండగ వ్యాపారాలు దెబ్బతింటాయని తెలిపింది.

ఇసిఐని వ్యతిరేకిస్తూనే రామ్‌లీలా నిరసనకు మూడు పార్టీలు డుమ్మా!




న్యూఢిల్లీ, నవంబరు 1: ఈసీపై పోరాటం చేస్తూ కూడా రాంలీలా మైదానానికి రాకుండా దూరంగా పలు ప్రతిపక్షపార్టీలు ఉండిపోయాయి. ఈసీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం ఇండియా కూటమి రాంలీలా మైదానంలో నిర్వహిస్తున్న భారీ సభకు కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీ, టీఎంసీ, శివసేన ఉద్ధవ్ వర్గం, శరద్ పవార్ ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఇలా ఇండియా కూటమిలో ఉన్న పలు రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. కానీ అదే ఇండియా కూటమిలో ఉన్న ఆప్, డీఎంకే సహా పలు పార్టీలు మాత్రం హాజరు కాలేదు. ఈ పార్టీలు గత కొంతకాలంగా ఈసీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొంటున్నా విపక్షాల ఐక్యత చాటుకోవాల్సిన కీలక సమయంలో మాత్రం రాంలీలా మైదానానికి రాకుండా దూరంగా ఉండిపోయాయి. ఇవాళ రాంలీలా మైదానంలో జరుగుతున్న నిరసన సభకు అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్, స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకేతో పాటు ఇండియా కూటమిలో లేకపోయినా ఈ మధ్య ఈసీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వైఎస్సార్సీపీ, బీఆర్ఎస్, జేడీయూ వంటి పార్టీలు రాకుండా దూరంగా ఉన్నాయి. ఈ పార్టీలన్నీ గతంలో ప్రధాని మోడీకి మద్దతుగా నిలిచాయి. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన పలు బిల్లులకు, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ బీజేపీకి మద్దతిచ్చాయి. కానీ మారిన పరిస్థితుల్లో తమ సొంత రాష్ట్రాల్లో అధికారం కోల్పోయాక ఈసీపై పోరు ప్రారంభించాయి. కానీ విపక్షాలతో కలిసే పరిస్థితి లేకపోవడంతో దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా కాంగ్రెస్ తో కలిసి పోరాడటం ఇష్టం లేక వైసీపీ, బీఆర్ఎస్, ఆప్ వంటి పార్టీలు రాం లీలా మైదానంలో నిరసనకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఢిల్లీలో 2.5 లక్షల దుకాణాలు మూతపడ్డాయి!

రాహుల్‌కు ఢిల్లీ వ్యాపారుల సంఘం మళ్లీ లేఖ



న్యూఢిల్లీ, నవంబరు 1: ఢిల్లీలో వరస నిరసనలు వ్యాపారుల పొట్టకొడుతున్నాయి. ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పారీ నిరసనల వల్ల వ్యాపారం దెబ్బతింటోందని వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఆదివారం, నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి ఇచ్చిన భారీ నిరసన పిలుపుపై వ్యాపారుల సంఘం మండిపడుతోంది. దీపావళి పండగ ముందు జరుగుతున్న ఈ ర్యాలీ వల్ల ఢిల్లీలోని సుమారు 2.5 లక్షల దుకాణాలు మూతపడ్డాయని, 80 శాతం వ్యాపారాలు నిలిచిపోయాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఆరోపించింది. ఈ పరిణామాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సిటిఐ నాలుగోసారి లేఖ రాసింది. రామ్‌లీలా మైదాన్ చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయిందని, దీంతో ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని వెల్లడించింది. ఇదిలా ఉంటే, వరసగా వ్యాపారస్తులు రాహుల్ గాంధీకి విన్నవిస్తున్న నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా ఒక వీడియో రిలీజ్ చేశారు. ఢిల్లీ నిరసనలో పాల్గొనేందుకు వస్తున్నవారు, చిరు వ్యాపారుల వద్ద షాపింగ్ చేయాలని కోరారు. దీని వల్ల వారి వ్యాపారాలు బాగుంటాయని అన్నారు. వ్యాపారాలు నష్టపోతున్నాయని బీజేపీ అపోహలు సృష్టిస్తోందని రాహుల్ ఆరోపించారు.

ఐరోపా వీధుల్లో ప్రజాగ్రహం



- ఫ్రాన్స్, జర్మనీలో భారీ నిరసనలు
- మెరుగైన విద్య, ఆరోగ్య సేవలందించాలి, జీవన వ్యయం తగ్గించాలంటూ డిమాండ్
- జెన్ జి నిరసనలు హింసాత్మకం
- ఫ్రాంక్‌ఫర్ట్‌లో దుకాణాల దోపిడీ

ఫ్రాంక్‌ఫర్ట్/బెర్లిన్, నవంబరు 1: యూరప్‌లో జెన్ జీ ఆందోళనలు ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. హక్కుల పేరుతో ఉద్యమానికి శ్రీకారం చుట్టి రోడ్లపైకి నిరసనలు చేపట్టారు. ఆందోళనకారుల్లో కొందరు హింసాత్మక ఘటనలకు పాల్పడటంతో పరిస్థితి అదుపుతప్పింది. జర్మనీలో అయితే వాణిజ్య సముదాయాల్లోకి ఆందోళనకారులు చొరబడి లూటీ చేశారు. వ్యాపార కేంద్రాలను ధ్వంసం చేశారు. బ్యాంకుల్లోకి చొరబడి నగదు ఎత్తుకెళ్లారు. కొన్ని చోట్ల వాణిజ్య భవనాలు, వ్యాపార సంస్థల్లోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. పెట్రోల్ బాంబులు విసిరి నిప్పుపెట్టారు. అంతర్జాతీయ మీడియాల కథనాల ప్రకారం, ఫ్రాన్స్, జర్మనీ దేశాలలో వేలాది మంది ప్రజలు తమ భవిష్యత్తు కోసం, పెరుగుతున్న జీవన వ్యయం, వివిధ ప్రజా సమస్యలపై శనివారం పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు.

తాజాగా జర్మనీలో జెన్‌జీ యువత చేపట్టిన నిరసనలు తీవ్ర ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. విద్యకు నిధులు పెంచాలని, జీవన వ్యయాన్ని త గ్గిం చా ల ని, తప్ప నిసరి సైనిక సేవను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది యువత దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లోని రోడ్లపైకి వచ్చారు. శనివారం రాత్రి ఫ్రాంక్‌ఫర్ట్‌లో నిరసనలు తీవ్ర హింసాత్మకంగా మారాయి. ముసుగులు ధరించిన కొందరు నిరసనకారులు దుకాణాలను దోచుకున్నారు. పోలీసులపై పెట్రోల్ బాంబులు విసిరారు. 'జెన్ జడ్ రెగెల్ట్' అనే ప్రచార బృందం ఈ నిరసనలకు పిలుపునిచ్చింది. బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ సహా దేశంలోని 34 నగరాల్లో ఆందోళనలు జరిగాయి. విద్యా రంగంలో బడ్జెట్ కోతలు, పాఠశాలలకు నిధుల కొరత, పెరుగుతున్న జీవన వ్యయం వంటి అంశాలు యువతలో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. బెర్లిన్, మ్యూనిచ్, ఫ్రాంక్‌ఫర్ట్ వంటి ప్రముఖ నగరాలలో జరిగిన ఈ ప్రదర్శనలకు యువత హాలోవీన్ పండుగను వేదికగా ఎంచుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించడంతో పాటు, బెర్లిన్‌లోని లగ్జరీ దుకాణాలు తమ కిటికీలను బోర్డులతో మూసివేశాయి. అయితే జర్మనీలో ప్రదర్శనలు కొంతవరకు శాంతియుతంగానే ముగిశాయి.

తప్పనిసరి సైనిక సేవను వ్యతిరేకించడంతో పాటు విద్య, వైద్య రంగాలకు మరిన్ని నిదులు కేటాయించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఐరోపాలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జర్మనీలో జీవన వ్యయాన్ని తట్టుకోవడం కష్టంగా మారిందని యువత చెబుతోంది. తాము శాంతి, స్వేచ్ఛ కోసం పోరాడుతున్నామని, ఆరోగ్య, విద్యా వ్యవస్థలకు మెరుగైన మద్దతు అందించాలని బెర్లిన్‌లో జరిగిన ర్యాలీలో 'జెన్ జడ్ రెగెల్ట్ ప్రతినిధి లీనా ఫ్రెడ్రిక్ అన్నారు. మరోవైపు ఫ్రాన్స్‌లో ప్రసిద్ధ 'ఎల్లో వెస్ట్' ఉద్యమం మళ్లీ ఉధృతమైంది. విద్యార్థులు, కార్మిక సంఘాలు కలిసి దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టడంతో రెండు దేశాలలోనూ పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అల్లర్లు జరిగే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ఫ్రెంచ్ ఇంటీరియర్ మంత్రిత్వ శాఖ సుమారు 70వేల మంది అదనపు పోలీసులను దేశవ్యాప్తంగా మోహరించింది. హాలోవీన్ రాత్రి సమయంలో అల్లర్లు జరగవచ్చనే ఆందోళనలతో అధికారులు బహిరంగ ప్రదేశాలలో గుమిగూడటంపై ఆంక్షలు విధించారు. సామాజిక మాధ్యమాలలో కొందరు హింసను, విప్లవాన్ని ప్రేరేపించేలా ప్రచారం చేయడం పట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖాలను కప్పుకోవడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఫ్రాన్స్‌లో సెప్టెంబర్ చివరిలో పాఠశాలల సమస్యలపై మొదలైన ఈ నిరసనలు, ఇప్పుడు ఆర్థిక భారం, ఉపాధ్యాయుల కొరత, విద్యా రంగ సమస్యలు, ఇతర ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమంగా రూపాంతరం చెందాయి.

ఒకే వేదికపైకి ఇండియా కూటమి నేతలు!

ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీలో పాల్గొన్న సీనియర్లు

న్యూఢిల్లీ,నవంబరు 1: ఢిల్లీలోని చారి త్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో ప్రతి పక్షాల ఇండియా కూటమి నిర్వహించ తలపెట్టిన ఓట్ బచావో, దేశ్ బచావో మహా ర్యాలీ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఎన్డీఏ ప్రభుత్వ వైఖరికి నిరసనగా, ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు ఒకే వేదికపైకి వచ్చారు. వారంతా కూడా మింటో హౌస్ నుంచి రామ్ లీలా మైదాన్ కు రెండు ఓపెన్ టాప్ బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్షాలకు చెందిన పలువురు కేంద్ర, ప్రాంతీయ నేతలు ఈ బస్సులో ఒకేచోట కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే సహా పలువురు కీలక ప్రతిపక్ష నాయకులు ఒకే వేదికపై కొలువుదీరారు. దేశంలోని వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన విపక్ష శ్రేణులు ఒకే తాటి పై నిలబడి తమ బలమైన ఐక్యతను చాటుకున్నాయి. మింటో రోడ్ వద్ద ఆరంభమైన ఈ ర్యాలీలో దాదాపు అన్ని విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు, కేంద్ర మాజీమంత్రులు తరలివచ్చారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిరసన ర్యాలీ చేపట్టారు. వారి రాకతో ఢిల్లీ వీధులు క్రిక్కిరిసిపోయాయి. అటు రామ్ లీలా మైదన్ లో కూడా ఇసుకవేస్తే రాలనంత మంది జనం కనిపించారు. ర్యాలీ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో అరాచకం సృష్టించడం తమ ఉద్దేశం కాదని, రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాపాడడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పౌరుల ఓటు హక్కును అపహరించే యత్నాలను అడ్డుకుంటామని, రాజ్యాంగ సూత్రాలపై దాడులు ఆగినప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రామ్‌లీలా మైదానానికి తరలివచ్చిన ప్రజాసందోహం విపక్షాల వైపే ఉందనడానికి బలమైన సంకేతమని థరూర్ ధీమా వ్యక్తం చేశారు.

బిజెపికి లొంగిపోయే ప్రసక్తే లేదు


ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతాం: మమతా బెనర్జీ



రామ్‌లీలార్యాలీ సందర్భంగా ప్రసంగిస్తున్న బెంగాల్ మాజీ సిఎం మమత

న్యూఢిల్లీ, నవంబరు 1: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ బెంగాల్‌ను దోచుకుందని ఆరోపించిన ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ తాము లొంగిపోయేది లేదని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియ కారణంగా బెంగాల్ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్న మమతా బెనర్జీ, మేము వెనక్కి తగ్గేది లేదు. ప్రాణాలైనా ఇస్తాం పోరాడతాం కానీ లొంగిపోయే ప్రసక్తే లేదు. వారు మన బెంగాల్‌ను దోచుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి తిరిగి నిలబెడతాం. రాజకీయాల ద్వారానే మా పోరాటం కొనసాగిస్తాం. ప్రజాస్వామ్య మార్గంలోనే ప్రతీకారం తీర్చుకుంటామని వ్యాఖ్యానించారు. బీజేపీపై మరోసారి విమర్శలు చేసిన ఆమె ఆ పార్టీ నిధులు, ఆస్తులను దోచుకుంటోందని ఆరోపించారు. రామజన్మభూమి, వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన నిధుల విషయంలోనూ ఆరోపణలు చేశారు. పోలీసు వ్యవస్థ బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని, కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటోందని విమర్శించారు. బీజేపీకి సొంతంగా ఎలాంటి సంస్థాగత వ్యవస్థ లేదు. అందుకే పోలీసులతో పార్టీ పనులు చేయిస్తోంది. దర్యాప్తు సంస్థలు బీజేపీ కోసం పనిచేయడం లేదు. బీజేపీ పోతుందని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. బీజేపీతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కూడా మమతా బెనర్జీ లక్ష్యంగా చేసుకున్నారు. ప్రముఖ చిన్నారుల గేయం జానీ జానీ యెస్ పాపాను రాజకీయ వ్యంగ్యంగా మార్చిసర్ ప్రక్రియపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆమె జ్ఞానేశ్ వానిష్ యెస్ పాపా అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఓట్ చోరీ యెస్ పాపా అంటూ ఎన్నికల సంఘం, బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి భారతదేశాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. చివరగా జ్ఞానేశ్ కుమార్? నో పాపా.. బీజేపీ ప్రభుత్వం? నో పాపా అంటూ తన నిరసనను వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఇండియా కూటమి చలో ఢిల్లీ నిరసనప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆదివారం ఢిల్లీలో చలో ఢిల్లీ పేరుతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ తదితర ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు. వేలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి రామ్‌లీలా మైదాన్ వైపు ర్యాలీ నిర్వహించారు.

ఇజ్రాయెల్ ప్రధానిగా మాజీ రక్షణ చీఫ్ ఐసెన్‌కోట్!



టెల్ అవీవ్, నవంబరు 1: ఇజ్రాయెల్ రాజకీయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అరబ్ లీగ్ అభ్యర్థులు బయటినుంచి మద్దతిస్తామని ప్రకటించడంతో ఇపుడు నెతన్యాహు ప్రత్యర్థి ఐసెన్‌కోట్ ప్రధాని పదవి చేపట్టేందుకు మార్గం సులువయింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పదవి తీవ్ర ముప్పులో పడింది. 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 61 సీట్లు అవసరం కాగా, నెతన్యాహు నేతృత్వంలోని కూటమి కేవలం 53 స్థానాలకే పరిమితమైంది. గతంలో 68 సీట్లు ఉన్న నెతన్యాహు వర్గానికి ఈ ఎన్నికలు భారీ షాక్ ఇచ్చాయి. 2023 హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్‌లో తొలిసారిగా జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు అక్కడ తీవ్ర రాజకీయ అనిశ్చితికి దారితీశాయి. మరోవైపు నెతన్యాహును అధికారం నుంచి దించేందుకు ప్రధాన ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. నెతన్యాహు వ్యతిరేక యూదు పార్టీలకు 48 స్థానాలు రాగా, అక్కడ కీలక శక్తిగా అవతరించిన రెండు ప్రధాన అరబ్ పార్టీలు రామ్ అండ్ జాయింట్ లిస్ట్ లకు కలిపి 19 సీట్లు వచ్చాయి. తాజాగా ఈ అరబ్ పార్టీలు నెతన్యాహును గద్దె దించేందుకు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ గాడీ ఐసెన్‌కోట్ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడినట్లు సమాచారం. ఈ రెండూ కలిస్తే నెతన్యాహు వ్యతిరేక వర్గం బలం 67కు చేరి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన మెజారిటీ లభిస్తుంది.అరబ్ పార్టీలు నేరుగా ప్రభుత్వంలో చేరకుండా బయటి నుంచి మద్దతు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి. 1993లో ఓస్లో ఒప్పందం సమయంలో దివంగత ప్రధాని యిట్జాక్ రాబిన్ ప్రభుత్వానికి అరబ్ పార్టీలు బయటి నుంచి మద్దతు ఇచ్చాయో, ఇప్పుడు గాది ఐసెన్‌కోట్‌కు మద్దతిచ్చాయి.

రామ్‌లీలా ఇండియా కూటమి సభకు పోలీసుల అసాధారణ భద్రత



న్యూఢిల్లీ, నవంబరు 1: ఇండియా కూటమి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాంలీలా మైదానం సభకు ఢిల్లీ పోలీసులు అసాధారణ రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సభకు సుమారు 40,000 నుంచి 50,000 మంది హాజరవుతారని పోలీసులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 3,500 నుంచి 4,000 మంది ఢిల్లీ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) సిబ్బందిని మోహరించారు. సభా ప్రాంగణాన్ని 14 జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌ను ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఉంచారు. మొత్తం భద్రతను అడిషనల్ డీసీపీ ర్యాంకు అధికారులు పర్యవేక్షించారు. 250కి పైగా హైడెఫినిషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో మైదానం పరిసరాలను నిరంతరం గమనిస్తువచ్చారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ శనివారమే రాంలీలా మైదానం, పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను సమీక్షించారు. సభకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతి ఉందని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని పోలీసులు నిర్వాహకులకు స్పష్టమైన షరతులు విధించారు. తాగునీరు, టాయిలెట్ వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సభ కారణంగా మధ్య ఢిల్లీలో ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. రాజ్‌ఘాట్, ఢిల్లీ గేట్, ఐటీవో, అజ్మేరీ గేట్ సహా 10 ప్రాంతాల్లో దారి మళ్లింపులు ప్రకటించగా, 11 ప్రధాన రహదారులపై రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. బహదూర్ షా జఫర్ మార్గ్, జవహర్‌లాల్ నెహ్రూ మార్గ్, బారాఖంబా రోడ్ వంటి కీలక మార్గాల్లో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు.

సమీపంలోని ఎల్ఎన్‌జేపీ, జీబీ పంత్ ఆసుపత్రులకు వెళ్లే అంబులెన్సుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. మరోవైపు, దీపావళి పండుగ సీజన్‌లో ఈ సభ వల్ల తమ వ్యాపారానికి నష్టం వాటిల్లుతుందని స్థానిక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ర్యాలీకి తెలంగాణ నుంచి వచ్చే కార్యకర్తల కోసం రవాణా, పార్కింగ్ ఏర్పాట్లను ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

ర్యాలీ నిరసనలకు సిజెపి మద్దతు: అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ, నవంబరు 1: కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఢిల్లీలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. తమ నిరసనలకు మద్దతు తెలిపినందుకు మమతకు దీప్కే కృతజ్ఞతలు చెప్పారు. ఎన్నికల సంఘంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఆదివారం నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ చేపట్టింది. ఈ ర్యాలీకి సిజెపి మద్దతు తెలుపుతున్నట్లు దీప్కే ప్రకటించారు. ఈ ర్యాలీలో సిజెపి నేరుగా పాల్గొనబోదని, తమ సంస్థ రాజకీయాలకు న్యూట్రల్‌గా ఉండాలని భావిస్తుందని ఆయన చెప్పారు.

పంజాబ్‌లో ఆప్‌కు ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా



అమృత్‌సర్, నవంబరు 1: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పారీకు ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ప్రకటించిన తొలి అభ్యర్థుల జాబితాలో టికెట్ నిరాకరించిన కారణంగా ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేశారు. సనౌర్ నియోజకవర్గ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్‌మజ్రా, సమానా ఎమ్మెల్యే చేతన్ సింగ్ జౌరామజ్రా ఆప్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. హర్మీత్ సింగ్ తన రాజీనామా లేఖను ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు పంపారు. చేతన్ సింగ్ సోషల్ మీడియా పోస్టు ద్వారా పార్టీ వీడుతున్నట్లు వెల్లడించారు. తన నిర్ణయాన్ని వెంటనే ఆమోదించాలని పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరాను కోరారు.

మేఘాలయ ఏకైక యుడిపి ఎమ్మెల్యే రాజీనామా




షిల్లాంగ్, నవంబరు 1: మేఘాలయ రాజకీయాల్లో కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ) ప్రస్తుతం తీవ్రమైన ఉనికి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేల్లో 11 మంది బీజేపీ, ఎన్పీపీలో చేరారు. దీంతో మిగిలిన ఒక్కగానొక్క ఎమ్మెల్యే, యూడీపీ అధ్యక్షుడైన మెత్బా లింగ్డో శనివారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సీఎం కాన్రాడ్ కె. సంగ్మా నేతృత్వంలోని మేఘాలయ డెమోక్రటిక్ అలయన్స్ (ఎండీఏ) ప్రభుత్వంలో ఏడాదికి పైగా మంత్రిగా ఆయన పనిచేశారు.

విషవాయువు పీల్చి నలుగురు మృతి

ఉజ్జయిని, నవంబరు 1: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విషవాయువును పీల్చి నలుగురు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే దేవాస్ రోడ్డులోని శ్రీ గంగా హోటల్‌లో శనివారం రాత్రి భూగర్భ వ్యర్థాల గదిని శుభ్రం చేస్తుండగా విష వాయువులను పీల్చి నలుగురు హోటల్ కార్మికులు మరణించారు. వారిని రక్షించడానికి ప్రయత్నించిన మరో ఇద్దరు కూడా అస్వస్థతకు గురై దవాఖానలో చేరారు.

నీళ్లకు బదులు చెర్రీకోక్ తాగిన వారెన్ బఫెట్



ముంబయి, నవంబరు 1: ప్రపంచంలోని అత్యంత విజయవంతమైన, దిగ్గజ ఇన్వెస్టర్లలో ఒకరైన వారెన్ బఫెట్ గురించి ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. 96 ఏళ్ల బఫెట్, దాదాపు ఐదు దశాబ్దాలుగా నీళ్లు తాగడం లేదట. తన దాహాన్ని తీర్చుకోవడానికి, శరీరానికి అవసరమైన ద్రవాల కోసం ఆయనకు ఇష్టమైన చెర్రీ కోక్ పానీయాన్నే సేవిస్తారట. ఈ ఆశ్చర్యకరమైన విషయాన్ని మరో బిలియనీర్, హెడ్జ్ ఫండ్ మేనేజర్ బిల్ అక్‌మన్ ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొన్నేళ్ల క్రితం బఫెట్ తన ఇంటికి డిన్నర్‌కు వచ్చినప్పుడు జరిగిన సంభాషణను అక్‌మన్ గుర్తుచేసుకున్నారు. బఫెట్‌కు నీళ్లు ఆఫర్ చేయగా, ఆయన సున్నితంగా తిరస్కరించారని చెప్పారు.



రన్‌ను ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామిజీ, సిపి డాక్టర్ తరుణ్‌జోషి

ఘనంగా 'ఈక్వాలిటీ రన్'

సమతామూర్తి ప్రాంగణంలో నిర్వహణ

ముఖ్యఅతిథులుగా చినజీయర్ స్వామిజీ, సిపి డాక్టర్ తరుణ్‌జోషి

హైదరాబాద్ (శంషాబాద్), నవంబరు 1, ప్రభాతవార్త: సమాజంలో సమానత్వ భావనను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం (స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ) ప్రాంగణంలో ఆదివారం 'ఈక్వాలిటీ రన్' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. త్రిదండి చినజీయర్ స్వామిజీ, ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామిజీ, సీపీ తరుణ్‌జోషి కలిసి జెండా ఊపి ఈక్వాలిటీ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చినజీయర్‌స్వామిజీ ఆశీర్వచనాలు అందిస్తూ భగవద్రామానుజుల సమతా దృక్పథం, సమానత్వ సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడాకార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, సమానత్వ భావన ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం, నడక, పరుగు వంటి శారీరక కార్యకలాపాలకు సమయం కేటాయించాలని సూచించారు. ఈక్వాలిటీ రన్‌లో భాగంగా 5కే, 10కే, 21కే విభాగాల్లో నిర్వహించిన పరుగుపోటీల్లో 350 మందికిపైగా రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక యువత, మహిళలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, పోలీస్ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. చిన్నారులు, యువత నుంచి పెద్దల వరకు వివిధ వయసుల వారు ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఉత్సాహంగా పరుగులు తీశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, పోలీస్ శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫెడ్ రికార్డుస్థాయి ప్రగతి

రైతులకు రూ.1,100 కోట్ల చెల్లింపులు

ప్రాసెసింగ్‌లో 44.60 శాతం వృద్ధి

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త : తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు, ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధిలో తెలంగాణ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ (టీజీ ఆయిల్ ఫెడ్) 2025-26లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ మేరకు వ్యవసాయ మంత్రి కార్యాలయం ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రైతులకు మెరుగైన సేవలు అందించడం, ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలను విస్తరించడం వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. గత ఏడాదితో పోలిస్తే గెలల ప్రాసెసింగ్‌లో ఏకంగా 44.60 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2024-25లో 3,27,803 టన్నుల గెలలను ప్రాసెస్ చేసిన ఆయిల్ ఫెడ్ 2025-26లో 4,73,997 టన్నులు చేసింది. గత ఏడాదితో పోలిస్తే అదనంగా 1,46,194 టన్నుల ప్రాసెసింగ్ చేపట్టి 44.60 శాతం వృద్ధిని సాధించింది. తక్కువ వయస్సు కలిగిన అప్పారావుపేట, నర్మెట్ట ఆయిల్‌పామ్ తోటల నుంచి వచ్చిన సుమారు 1.50 లక్షల టన్నుల గెలలను సైతం సమర్థవంతంగా ప్రాసెస్ చేస్తూ 19.62 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో సాధించడం విశేషం. కొత్తగా ఏర్పాటు చేసిన నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పూర్తి సామర్థ్యంతో విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రాసెసింగ్ రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. 2025-26లో ఒక నెలలో అత్యధికంగా 50,150 టన్నుల గెలలను ప్రాసెస్ చేసింది. గత ఏడాది నమోదైన 39,840 టన్నులతో పోలిస్తే 10,310 మెట్రిక్ టన్నుల అదనపు ప్రాసెసింగ్ సాధించింది. అలాగే రోజువారీ ప్రాసెసింగ్‌లోనూ గత ఏడాది 1,650 టన్నుల రికార్డును అధిగమించి 1,850 టన్నుల గెలలను ప్రాసెస్ చేసింది. అశ్వారావుపేట ప్రాసెసింగ్ యూనిట్ ఒక్కటే ఈ ఏడాది 1,01,495 టన్నుల గెలలను ప్రాసెస్ చేయడం విశేషం.

వైవిధ్యంలో ఏకత్వమే భారత్ అసలైన బలం

భాషలు, సంస్కృతులు దేశ ఐక్యతకు పునాదులు

రాష్ట్రాల స్థాపన దినోత్సవంలో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: భారతదేశంలోని భాషా, సాంస్కృతిక, ప్రాంతీయ వైవిధ్యాలు జాతీయ ఐక్యతకు బలమైన పునాదులని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లా అన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాల స్థాపన దినోత్సవాలను ఒకే వేదికపై నిర్వహిం చడం 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం లోక్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ దీవులు, చండీగఢ్, ఢిల్లీ, లక్షద్వీప్, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, తన సతీమణి జానకి శుక్లాతో కలిసి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని మినీ భారతంగా అభివర్ణించారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను తెలంగాణ ఎల్లప్పుడూ ఆప్యాయంగా ఆహ్వానిస్తోందని, సమ్మిళిత సంస్కృతి, పరస్పర సామరస్యంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

భారతదేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అందించిన సేవలు చిరస్మరణీయమని గవర్నర్ అన్నారు. అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించు కున్నామని, వివిధ రాష్ట్రాల స్థాపన దినోత్సవాలను జరుపుకోవడం ద్వారా దేశ ఐక్యత నిదర్శనం అన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడినా.. అన్ని రాష్ట్రాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వివరించారు. ప్రతి రాష్ట్రానికీ ప్రత్యేక చరిత్ర, భాషలు సాంస్కృతిక సంగమం దేశ వైవిధ్యాన్ని ప్రతిబింబి స్తున్నాయని అన్నారు.

ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లి స్థిరపడిన ప్రజలు తమ సొంత సంప్రదాయాలను పాటిస్తూనే స్థానిక సంస్కృతులను కూడా ఆచరిస్తున్నారని చెప్పారు. రాజస్థాన్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన ప్రజలు తమ సంప్రదాయాలతో పాటు ఇక్కడి బతుకమ్మ వంటి పండుగలను కూడా జరుపుకోవడం ఇందుకు ఉదా హరణగా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయా స్' స్ఫూర్తితో వికసిత భారత్ దిశగా ముందుకు సాగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఆత్మ నిర్భరత, సమ్మిళిత అభివృద్ధి, మానవీయ విలు వలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్య, వ్యాపార రంగాల సాధికారత, మహిళా నాయకత్వం, పర్యా వరణ పరిరక్షణ, సమాజంలోని చివరి వ్యక్తి వరకు సుపరి పాలన అందించడం అభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం, ప్రతి ప్రాంతం దేశ ప్రగతిలో భాగస్వామ్యమైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవు తుందని అన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ...వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలు సమష్టిగా దేశ అభివృద్ధికి కృషి చేస్తూ దేశాన్ని సమున్నతంగా నిలపాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను కట్టిపడేశాయి. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, హోం శాఖ కార్యదర్శి శిఖా గోయల్, తెలంగాణ జూ పార్కుల సంచాలకులు డాక్టర్ సునీల్ ఎస్. హీరేమత్, సంయుక్త కార్యదర్శి కొమండూరు శశి కిరణ్. పెద్ద సంఖ్యలో హాజరైన సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



ఆదివారం లోక్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీహాల్‌లో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ వేడుకల కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలకు ట్రీటెడ్ వేస్ట్ వాటర్‌నే వినియోగించాలి

ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, నిర్మాణ సంస్థలకు సిఎం రేవంత్‌రెడ్డి కీలక సూచన

మెట్రో వాటర్ సప్లై సివరేజ్ బోర్డు 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అభినందనలు



రహదారి పక్కన మొక్కలకు శుద్ధిచేసిన మురుగునీటిని వినియోగిస్తుండగా పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థలు తమ తోటల పెంపకం, నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాల కోసం శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వేస్ట్‌వాటర్) మరింత విస్తృతంగా వినియోగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలక సూచన చేశారు. దీనివల్ల మంచినీటిపై ఆధారపడటం తగ్గడంతో పాటు, అత్యవసర గృహావస రాలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చూడవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎం డబ్ల్యుఎస్ఎస్‌బి) 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బోర్డు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబసభ్యులందరికీ హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియజేశారు. గత 37 సంవత్స రాలుగా హైదరాబాద్ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు, మురుగునీటి నిర్వహణ సేవలను కల్పించడంలో హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి, ప్రజారోగ్యం, సమగ్ర ప్రగతికి బోర్డు అందించిన విశేష సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినం దించారు. హైదరాబాద్ నగరం నిరంతరం విస్తరిస్తున్న నేపథ్యంలో నీటి భద్రతకు, విలువైన జల వనరుల సుస్థిర నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, ఉత్పన్నమవుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మంచినీటి వనరులను పరిరక్షిం చేందుకు, గృహావసరాలకు సంబంధం లేని ఇతర అవసరాల కోసం మంచినీటి వినియోగాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆదివారం (నవంబరు 1) నుంచిడయల్ గ్రీన్ ట్యాంకర్ - గ్రీన్ ట్యాంకర్ ఆపరేషన్స్' కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని ముఖ్యమంత్రి అభినందిస్తూ, సుస్థిర నీటి నిర్వహణ దిశగా ఇది సరైన సమయంలో చేపట్టిన కీలకమైన కార్యక్రమమని అభివర్ణించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బికి అభినందనలు తెలియజేస్తూ, కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) ప్రజలకు సేవలందించే లక్ష్యంతో హెచ్ఎం డబ్ల్యుఎస్ఎస్‌బి తన ప్రస్థానంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నీటి సంరక్షణను సమిష్టి బాధ్యతగా స్వీకరించాలని, సుస్థిరమైన, నీటి భద్రత కలిగిన హైదరాబాద్ నిర్మాణంలో భాగస్వాములై ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు, సంబంధిత భాగస్వాములందరికీ పిలుపునిచ్చారు.

ఆర్టీసీ ఉచిత బస్సుతో 68 శాతం తగ్గిన మహిళల ఖర్చు

43.8 శాతం నుండి 71.2 శాతానికి పెరిగిన వినియోగం

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం మహాలక్ష్మి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన తర్వాత, మహిళల సగటు ప్రయాణ ఖర్చు 68.1 తగ్గింది. ఇదే సమయంలో ఆర్టీసీ బస్సులపై ఆధారపడటం గణనీయంగా పెరిగిందని సస్టెనబుల్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లివబిలిటీ అధ్యయనంలో వెల్లడించింది. "మహిళల ఉచిత బస్సు సర్వీసుల ప్రభావాన్ని అన్వేషించడం" అనే శీర్షికతో, ఈ అధ్యయనాన్ని విజయవాడ, న్యూఢిల్లీలోని ప్లానింగ్, ఆర్కిటెక్చర్ సంయుక్తంగా నిర్వహించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం వ్యాప్తంగా మహిళల నుండి వచ్చిన 410 ప్రతిస్పందనలను విశ్లేషించారు. ప్రతిస్పందించిన వారిలో 49 మంది విద్యార్థులు కాగా, సుమారు 63 మందికి సొంత వాహనం లేదు. ప్రతీ ట్రిప్‌క సగటు ఖర్చు రూ.30.4 నుండి రూ.9.7కు తగ్గగా, ప్రధానంగా టిజిఎస్‌ఆర్టీసీ బస్సులను ఉపయోగించే మహిళల వాటా 43.8 శాతం నుండి 71.2 శాతానికి పెరిగింది. దీనికి తగినట్లుగా సగటు ప్రయాణ దూరం కూడా 7.5 కిలోమీటర్ల నుండి 8 కిలోమీటర్లకు పెరుగుదల చోటుచేసుకుంది. అలాగే సామాజిక ప్రయాణాలు 22.8 శాతం ఎక్కువ కాగా, ఆరోగ్య సంబంధిత ప్రయాణాలు 15.5 శాతం ఎక్కువయ్యాయి. వీక్లీ ప్రయాణాలు 4.23 నుండి 4.35 శాతానికి స్వల్పంగా పెరిగాయి. ఆదాయం, వయస్సు వర్గాలను బట్టి ప్రయో జనాలు వేర్వేరుగా ఉన్నాయి. నెలకు రూ.20 వేల కంటే తక్కువ సంపాదించే కుటుంబాలలోని మహిళలకు ప్రయాణ ఖర్చులు సుమారు 3 శాతం తగ్గాయి. అదే రూ.20,001 నుండి రూ.50 వేలు సంపాదించే వారిలో 69 శాతం, రూ.2 లక్షల కంటే ఎక్కువ సంపాదించే వారిలో 62 శాతం తగ్గుదల కనిపించింది. 20 ఏళ్లలోపు మహిళలు ప్రయాణ దూరం, ప్రయాణాల సంఖ్యలో అత్యధిక ప్రయోజనాలను పొందగా, 30 నుండి 40 ఏళ్ల మధ్య వయస్కులు బస్సులవైపు ఎక్కువగా మొగ్గు చూపారు.

40యేళ్లు పైబడిన మహిళలు అత్యధిక పొదుపును నమోదు చేశారు. విద్యార్థులు, అసంఘటితరంగ కార్మికులు బస్సుల వైపు అత్యధికంగా మొగ్గుచూపగా, గృహిణులు ప్రధానంగా తక్కువ ఖర్చుల వల్ల లబ్ధి పొందారు.

డిసెంబరు 18 నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్

హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఇందిరాపార్కు వద్దగల ఎన్టీఆర్ స్టేడియంలో 'హైదరాబాద్ బుక్ ఫెయిర్'ను నిర్వహిస్తున్నామని ఫెయిర్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో లోగోను ఫెయిర్ సలహాదారు ప్రముఖ పాత్రికేయులు కె.రామ చంద్రమూర్తి, ప్రొఫెసర్ రమామెల్కోటి, అధ్యక్ష, కార్యదర్శులు రాంపల్లి రమేష్, పి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు కె.బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ బుక్ ఫెయిర్‌లో 320 స్టాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు సాహిత్య సమావేశాలు కొన సాగుతాయన్నారు. అలాగే పుస్తకావిష్కరణ సభలు ఉంటాయని, రైటర్స్ స్టాల్స్, మీడియా స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ బుక్ ఫెయిర్‌లో పుస్తకాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని వారు కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి శోభన్‌బాబు, రజని, సజయ, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాను పేరుతో తగ్గిన ధాన్యం కొనుగోలు ధరలు

వారం రోజుల్లో రూ.600 తగ్గిన రేటు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: అర్నబ్ తుఫాను ప్రభావం వల్ల వర్షాలు కురియడంతో దాన్ని సాకుగా చూపి ధాన్యం కొనుగోలు ధరలను వ్యాపారులు తగ్గించి వేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తుపాను భయంతో వరి రైతులు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. మొదట్లో తడి వరికి కూడా అధిక ధరలు చెప్పిన వ్యాపారులు, ఇప్పుడు తేమ శాతం, నాణ్యత తక్కువగా ఉందని సాకుగా చూపి అధిక ధరలను నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం తన సేకరణ కేంద్రాలను ఎప్పుడు తెరుస్తుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో, చాలా మంది రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. వర్షానికి పంట తడిసిపోతే అంత మొత్తం కూడా రాదేమోనని రైతులు భయపడుతున్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షపాతం లోటు కారణంగా ఉత్పత్తి తగ్గడంతో, నాణ్యమైన వరి ధాన్యానికి అధిక గిరాకీ ఏర్పడింది. అర్నబ్ తుఫాను వల్ల వర్షాలు కురిసినప్పటికీ, మళ్లీ తాజాగా మరో తుపాను ఏర్పడిన నేపథ్యంలో కొన్ని రోజులుగా నెలకొన్న మేఘావృత వాతావరణం రైతులలో ఆందోళనను రేకెత్తించింది. వర్షాలు పడతాయనే భయంతో రైతులు పంట కోతను వేగవంతం చేసి, తమ పంటను అమ్ముకోవడానికి వ్యాపారులను సంప్రదించారు. మొదట్లో తడి వరి ధాన్యానికి కూడా అధిక ధరలు ప్రకటించి, ఆ తర్వాత ధరలను తగ్గించారు. దీంతో వారం రోజుల్లో ధర క్వింటాల్‌కు 600 రూపాయలు తగ్గింది. మూడు రోజుల్లో ఇది మరో రూ.300 తగ్గింది. వీణవంక మండలం, వాల్లపూర్ గ్రామానికి చెందిన చంద్రమోళి ఏడు క్వింటాళ్ల వరిని క్వింటాల్‌కు రూ.2,900 చొప్పున అమ్మారు.

నిధుల మళ్లింపు వ్యవహారంలో ఖజానా అధికారులపై వేటు

వివిధ కేడర్లకు చెందిన 12 మంది సస్పెన్షన్

నిబంధనలకు విరుద్ధంగా ఇతర ఖాతాలకు నిధుల బదలీ యత్నం

హైదరాబాద్, నవంబరు 31, ప్రభాతవార్త: రాష్ట్రంలో కీలకమైన ఖజానా శాఖలోని కొందరు అధికారులు అక్రమంగా నిధులు మళ్లింపునకు పాల్పతున్నారు. వివిధ ఖజానా శాఖ కార్యాలయాల్లో నిధుల చెల్లింపుల వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయలను ఇతర ఖాతాలకు మళ్లించేందుకు ప్రయత్నించడాన్ని ఆడిట్‌లో వెలుగులోకి రావడం సంచలనం రేకెత్తించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఖజానా శాఖ కు చెందిన 12 మంది అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అంతేకాకుండా ఈ నిధుల మళ్లింపు వ్యవహారంపై సమగ్ర విచారణకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనికి సంబంధించి గత నెల 27న ఉత్తర్వులు జారీ చేయగా ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. రాష్ట్రంలోని అందోల్, కొడకండ్ల హన్మకొండ, పఠాన్‌చెర్వులోని ఖజానా కార్యాలయాల్లో నిధుల మళ్లింపు వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఖజానా శాఖలో వివిధ విభాగాలు, ఉద్యోగుల కేడర్లను బట్టి చెల్లింపులపై పరిమితులు ఉంటాయి. పెన్షనర్లకు సంబంధించిన కొన్ని చెల్లింపుల విషయంలో రూ.16 లక్షల వరకు ఉన్న కేసులకు వర్తించే పరిమితిని మించి చెల్లింపులకు అనుమతులు ఇచ్చినట్లు రాష్ట్రస్థాయి అధికారులు ఆడిట్‌లో గుర్తించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలియవచ్చింది. దీంతో సంబంధిత చెల్లింపులను నిలిపివేసి, అందుకు బాధ్యులుగా భావిస్తున్న అధికారులపై ప్రాథమిక చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారా, వాస్తవంగా నిధులు మళ్లించారా అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. ఇక అందోల్ ఖజానా కార్యాలయంలో మాత్రం నిధుల బదిలీలకు సంబంధించిన వ్యవహారం భిన్నంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఖజానా శాఖతో సంబంధం లేని ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు నిధులు మళ్లించేందుకు ప్రయత్నించినట్టు ఆరోపణలు రావడంతో అక్కడ ఆరుగురు అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. చెల్లింపులకు ఆమోదం తెలిపిన అధికారులు, నిధులు జమ చేయాల్సిన ఖాతాల వివరాలను సరిచూశారా? లేదా? అనే కోణంలో పరిశీలన చేపట్టినట్టు వెల్లడవుతోంది. అలాగే జనగామ జిల్లా కొడకండ్ల ఖజానా కార్యాలయంలో నకిలీ చలాన్లను సృష్టించి ప్రభుత్వ నిధులకు గండికొట్టేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. అక్రమాలు జరిగిన సమయంలో కొడకండ్ల ఖజానా కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఉప ఖజానా అధికారిగా పనిచేసిన, ప్రస్తుతం నల్లగొండ జిల్లా మోత్కూరు ఉప ఖజానా అధికారిని సస్పెండ్ చేస్తూ ఉన్నతా ధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హన్మకొండ, పటాన్‌చెరు ఖజానా కార్యాలయాల్లో పెన్షనర్లకు చెల్లించే మొత్తాల విషయంలో పరిమితులకు మించి చెల్లింపులకు ఆమోదం తెలిపినట్టు ఆడిట్‌లో వెల్లడైన ట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఖజానా కార్యాలయంలో ఇద్దరిని సస్పెండ్ చేశారు. ఇక హన్మకొండ ఖజానా కార్యాలయంలో సహాయ ఖజానా అధికారి, ఉప ఖజానా అధికారి, సీనియర్ అకౌంటెంట్‌లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పర్యవేక్షణలో జరిగిన చెల్లింపులపై ఆడిట్ సందర్భంగా అభ్యంతరాలు వ్యక్తమైనట్టు సమాచారం. ప్రాథ మిక చర్యల్లో భాగంగా సస్పెన్షన్ విధించడంతో పాటు, అసలు ఏం జరిగిందనే అంశంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

సంక్షేమ గురుకులాల్లో 100 శాతం హాజరు

సామగ్రి పంపిణీలో జాప్యం వద్దు


ఎస్సీ గురుకుల సంస్థ కార్యదర్శి రవి

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: గురుకుల విద్యార్థుల హాజరును ప్రతిరోజూ ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో 100 శాతం నమోదు చేయాలని ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గుగులోతు రవి స్పష్టం చేశారు. హాజరు నమోదులో ఎలాంటి జాప్యం ఉండరాదని, వైద్యపరమైన కారణాలతో గైర్హాజరయ్యే విద్యార్థులకు నిబంధనల మేరకు మినహాయింపు ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో గురుకులాల నుంచి నమోదైన పంపిణీ వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, సమన్వయం చేసుకుని అందుబాటులో ఉన్న యూనిఫాంలను సేకరించి విద్యార్థులకు ఈ నెల 2వ తేదీ లోగా పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా యూనిఫాం వస్త్రం కొరతను గుర్తించి అవసరమైన పరిమాణానికి ఇండెంట్ సమర్పించాలన్నారు. గురుకులంలో అవసరానికి మించి బ్యాగులు, ఇతర సామగ్రి ఉంటే, కొరత ఉన్న ఇతర వాటికి సర్దుబాటు చేయాలని సూచించారు. విద్యార్థుల సామగ్రికి సంబంధించిన ఇండెంట్, సరఫరా, స్వీకరణ, పంపిణీ వివరాలను కొత్త యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని చెప్పారు. 2027-28 విద్యా సంవత్సరానికి అవసరమైన సామగ్రి ఇండెంట్‌ను వాస్తవ విద్యార్థుల సంఖ్య, సంస్థల అవసరాల ఆధారంగా సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి

మెరుగైన మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానం కీలకం

హైతాబాద్ ప్రాంతంలో సిటిఆర్ఎల్ఎస్, వెల్‌స్పన్ పరిశ్రమలను సందర్శించిన సిఎస్ సంజయ్‌జాజు


రేడియల్ రోడ్డు పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, హైతాబాద్ ప్రాంతంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా సిటిఆర్ఎల్ఎస్, వెల్‌స్పన్ పరిశ్రమలను సందర్శించి, ఆయా సంస్థల కార్యకలాపాలు, పారిశ్రామిక అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అం శాలను సమీక్షించారు. అనంతరం అక్కడ నిర్మాణంలో ఉన్న రేడియల్ రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటగా సిటిఆర్ఎల్ఎస్, వెల్‌స్పన్ పరిశ్రమలను సందర్శించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆయా సంస్థల ప్రతినిధులతో మాట్లాడి, కంపెనీల కార్యకలా పాలు, ఉత్పత్తి సామర్థ్యం, పారిశ్రామిక అవసరాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను తెలుసుకున్నారు. పరి శ్రమల ప్రతినిధులు తమ సంస్థల కార్యకలాపాలు, భవిష్యత్ అవసరాలు, పారిశ్రామిక అభివృద్ధికి సం బంధించిన అంశాలను వివరించారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, వాటి నిర్వహణ, రవాణా సౌకర్యాల ప్రాధాన్యతపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. అనంతరం హైతాబాద్ ప్రాంతంలో చేపడుతున్న రేడియల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ముఖ్యంగా రేడియల్ రోడ్డు నంబర్2లో చైనేజ్ 20.50 కిలోమీటర్ల వద్ద జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనుల స్థితిగతులు, సాంకేతిక అంశాలు, పనుల అమలుకు సంబంధించిన వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు మెరుగైన రహదారి అనుసంధానం, పటిష్టమైన మౌలిక సదుపాయాలు అత్యంత కీలకమని ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన రవాణా సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పారిశ్రామిక కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ పర్యటనలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఆర్డీఓ పార్థసింహారెడ్డి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్, కంపెనీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటు వేయను..

రీపోలింగ్ నిర్వహిస్తేనే ఓటేస్తా!

పులివెందుల ఎన్నికలపై వైఎస్ జగన్



ఎపి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 1 ప్రభాతవార్త: పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఈ ఎన్నికల్లో తాను ఓటు వేయ బోనని స్పష్టం చేశారు. న్యాయంగా, ధర్మంగా రీపోలింగ్ నిర్వహిస్తేనే తిరిగి వచ్చి ఓటు వేస్తానని ప్రకటించారు. పులివెందులలో ప్రస్తుతం దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, అక్కడ జరుగుతున్న పరిణా మాలు ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు జగన్ వెల్లడించారు. ప్రస్తుతపరిస్థితుల్లో తాను ఓటు హక్కు వినియోగించుకుంటే అంతా సవ్యంగా, సజావుగా జరుగుతోందనే భావన ప్రజల్లో కలుగుతుందని పేర్కొన్నారు. అందుకే ప్రస్తుత ఎన్నికల ప్రక్రియపై తననిరసనను తెలియజేసేందుకు ఓటు వేయకూడదని నిర్ణయించు కున్నట్లుతెలిపారు. న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా రీపోలింగ్ నిర్వహించి నప్పుడే ఓటు వేయడానికి వస్తానని జగన్ చేసిన ప్రకటన పులివెందుల మున్సిపల్ ఎన్నికల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

మియాపూర్ భూములు పేదల ఇళ్లకు, విద్యాసంస్థల భవనాలకు కేటాయించాలి

సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త : మియాపూర్‌లోని 500 ఎకరాల ప్రభుత్వ భూములను వేలం వేయాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించి, ఆ భూములను ప్రజోపయోగ కార్యక్రమాలకు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎం కు లేఖ రాశారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసి మియాపూర్ భూములను ప్రభుత్వ భూములుగా సాధించుకోవడం అభినందనీయమని పేర్కొంటూ, వాటిని వేలం వేయడం కంటే నిరుపేదలకు ఇళ్లు నిర్మించడంతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం హాస్టళ్లు, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని సూచించారు. మొత్తం 500 ఎకరాల్లో 200 ఎకరాలను ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించాలని కోరారు. హైదరాబాద్ నగరంలో సుమారు ఆరు లక్షల కుటుంబాలకు సొంతంగా గజం స్థలం కూడా లేదని, అద్దె ఇళ్లలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేపడితే ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. మిగిలిన 300 ఎకరాలను విద్యాసంస్థల అవసరాలకు వినియోగించాలని ప్రతిపాదించారు. ఇందులో 100 ఎకరాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రభుత్వ కాలేజీ హాస్టళ్ల నిర్మాణానికి, మరో 200 ఎకరాలను గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు కేటాయించాలని కోరారు.



అమెరికాలో హాలోవీన్ వేడుకల వేళ కాల్పుల కలకలం

నలుగురు మృతి, 15 మందికి గాయాలు

డల్లాస్, నవంబరు 1: అమెరికాలో హాలోవీన్ వారాంతంలో కాల్పుల ఘటనలు కలకలం సృష్టించాయి. టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా, మరో 15 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. డల్లాస్‌లోని డీప్ ఎల్లమ్ ప్రాంతంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రాంతం షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, వినోద కేంద్రాలకు ప్రసిద్ధి చెందింది. కేవలం గంటా 15 నిమిషాల వ్యవధిలో మూడు కాల్పుల ఘటనలు జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మూడు ఘటనల మధ్య ఏదైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ చీఫ్ డేనియల్ కామెోక్స్ తెలిపారు. ఘటనాస్థలాలు విస్తృతంగా ఉన్నాయని, ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితులను విచారిస్తున్నామని, మూడు కాల్పుల ఘటనలకు మధ్య సంబంధాన్ని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. హాలోవీన్ వారాంతంలో అమెరికాలోని పలు నగరాల్లోనూ కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. అలబామా రాష్ట్రంలోని బర్మింగ్‌హామ్‌లో శనివారం రాత్రి లెజియన్ ఫీల్డ్ వెలుపల జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వార్షిక మ్యాజిక్ సిటీ క్లాసిక్ ఫుట్‌బాల్ మ్యాచ్ ముగిసిన అనంతరం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. డెలావేర్ రాష్ట్రంలోని నెవార్క్‌లో యూనివర్సిటీ ఆఫ్ డెలావేర్ క్యాంపస్ సమీపంలో శనివారం అర్ధరాత్రి కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వారందరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించినట్లు పోలీస్ లెఫ్టినెంట్ గ్రెగ్ డిఎలియా తెలిపారు.

చెదురుమదురు ఘటనలు మినహా ఎపిలో పోలింగ్ ప్రశాంతం

ఓటింగ్ 74%





విజయవాడలో ఆదివారం ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు, హిందూపురంలో బాలకృష్ణ దంపతులు

నగరాల్లో తక్కువ, చిన్న పట్టణాల్లో అధిక పోలింగ్

పల్నాడు, అనంతపురం జిల్లాల్లో హింసాత్మక ఘటనలు

విజయవాడలో పోలింగ్ ఆలస్యం కావడంతో సమయం పొడిగింపు

అధికారుల నుంచి నివేదికలు వస్తే చర్యలు: ఎపి ఎస్ఇసి పునేఠా

నివేదికలు పరిశీలించి రీపోలింగ్‌పై నిర్ణయమని కీలక ప్రకటన

విజయవాడ,నవంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఆదివారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మెజారిటీ ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున, ఐజీ రాజకుమారిలతో కలిసి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికలనిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, డీఐజీలు, ఎన్నికల పరిశీలకులతో ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు.రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పోలీస్ శాఖ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సరళి, ఫిర్యాదులు, హింసాత్మక ఘటనలపై నంద్యాల, కడప, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో సుమారు 45 నిమిషాల పాటు మాట్లాడినట్లు కమిషనర్ తెలిపారు. మెజారిటీ జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్లు నివేదించారని, కొన్ని జిల్లాల్లో స్వల్ప స్థాయిలో ఫిర్యాదులు అందినట్లు వివరించారని చెప్పారు. కొన్ని జిల్లాల్లో ఎలాంటి ఫిర్యాదులు, హింసాత్మక ఘటనలు నమోదు కాలేదని స్పష్టం చేశారు



ఆదివారం మీడియాతో ఎపి ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

మొత్తంగా 74శాతం వరకు పోలింగ్

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది.పోలింగ్ ముగిసే సమయానికి కార్పొరేషన్,పురపాలక,నగర పంచాయతీల్లో మొత్తంగా 74శాతం వరకు పోలింగ్ జరిగినట్లు సమాచారం.ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల తరువాత 48.9శాతం వరకు పోలింగ్ జరిగినట్లు అధికారికంగా సమాచారం వెలువడింది.ఆ తరువాత రెండు గంటల్లో పోలింగ్ శాతం క్రమంగా పుంజుకుని 62.శాతం వరకు జరిగినట్లు ప్రాథమిక సమాచారం ప్రచారంలోకి వచ్చింది.అయితే నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించామని ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు.

విజయవాడ 55వ వార్డులో పోలింగ్ గడువు పొడిగింపు..

విజయవాడలోని 55 వ వార్డులో సాంకేతిక, ఇతర కారణాలతో సుమారు రెండున్నర గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన నేపథ్యంలో, ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు పొడిగించినట్లు అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. జిల్లా కలెక్టర్ చేసిన అభ్యర్థనను పరిశీలించి, ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన కారణంగా ఓటర్లు నష్టపోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు వివరించారు.

ఫిర్యాదులపై నివేదికల ఆధారంగా చర్యలు..

పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగినట్లు జిల్లా కలెక్టర్లు తమ దృష్టికి తీసుకొచ్చారని కమిషనర్ తెలిపారు. పోలింగ్ పూర్తయిన అనంతరం అందే ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీవో) నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి, ఫిర్యాదుల్లో వాస్తవాలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటా మని వెల్లడించారు. విజయవాడలోని 55వ వార్డులో పోలింగ్ సమయాన్ని పొడిగించిన అంశం మినహా, మిగిలిన ప్రాంతాల నుంచి పెద్దగా సమస్యలు నివేదించబడలేదని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 48.03 శాతం పోలింగ్ నమోదైనట్లు కమిషనర్ వెల్లడించారు.

సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రితో రిసెప్షన్ కేంద్రాలకు చేరుకుంటా రని తెలిపారు. పోలింగ్ స్టేషన్ వారీగా నమోదైన ఓట్ల వివరాలను పరిశీలించి, మొత్తం ఓటింగ్ శాతాన్ని లెక్కిస్తారని చెప్పారు. ప్రస్తుతం అందిన సమాచారం ప్రాథమిక అంచనా మాత్రమేనని, రిసెప్షన్ కేంద్రాలనుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం సోమ వారంనాటికి కచ్చితమైన పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తామన్నారు.

డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 328 మంది మందుబాబుల పట్టివేత

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 328 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 280 మంది ద్విచక్ర వాహనదారులు, 18 మంది ఆటో డ్రైవర్లు, 30 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు.

పట్టుబడ్డ వారిలో 69 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 141 మంది 51 నుంచి 100 పాయిం ట్ల వరకు, 61మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 35 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 12 మంది 201 నుంచి 250 పా యింట్ల వరకు, ముగ్గురు 251 నుంచి 300 పాయింట్ల వరకు వుండగా ఏడుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పో లీసు కమి షనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్‌డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడి ంచారు.

సైబరాబాద్‌లో 205 మంది ..

ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 205 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 177 మంది ద్విచక్ర వాహనదారులు, ఎనిమి ది మంది ఆటో డ్రైవర్లు, 20 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టు బడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

మల్కాజిగిరి పరిధిలో 240 మంది..

కాగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 240 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 202 మంది ద్విచక్ర వాహనదారులు. ఏడుగురు ఆటో డ్రైవర్లు, 31 మంది కార్ల డ్రైవరు వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి తె లిపారు. పట్టుబడ్డ వారిలో 154 మంది 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు, 81 మంది 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు. 60 ఏళ్లు దాటిన వ్యక్తి ఒకరు వున్నారు.



మంచంపై చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

అల్వాల్‌లో భారీ చోరీ

హైదరాబాద్ (అల్వాల్), నవంబరు 1, ప్రభాతవార్త: అల్వాల్‌లో మరోసారి దొంగలు పంజా విసిరారు. శుభకార్యానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు ఇంటిని గుల్లగా మార్చేశారు. పెద్ద మొత్తంలో బంగారం, వెండి, నగదు దొంగలు పాలయ్యింది. చోరీకి సంబంధించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఓల్డ్అల్వాల్ జానకి నగర్‌లో రిటైర్డ్ ప్రైవేటు ఉద్యోగి నరసింహామూర్తి కుటుంబం నివాసం ఉంటోంది. శనివారం సాయంత్రం దమ్మాయిగూడాలో ఓ శుభకార్యానికి బాధిత కుటుంబం వెళ్ళింది. అర్థరాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని వారు గమనించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. ఇంటిలోకి వెళ్లి చూడా బెడ్‌రూములోని బీరువా తలుపులు తెరిచి ఉండగా దానిలోని వస్తువులు చెల్లా చెదురుగా మంచంపై పడి ఉన్నాయి. బీరువాలోని 29 తులాలు బంగారం, కిలో వెండి, 1.70వేలు రూపాయలు నగదును దొంగలు ఎత్తుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యుపి ఎన్నికలపై ఇప్పటి నుంచే బిజెపి ఫోకస్

లక్నో, నవంబరు 1: ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికలు సమీపిస్తు నేపథ్యంలో బీజేపీ తన వ్యూహాలకు పదును పెట్టింది. మూడోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన స్ట్రాటజిస్టులు యూపీలో మకాం వేశారు. ఇదిలా ఉంటే, రాబోయే 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 402 స్థానాలకు గానూ 325 నుంచి 350 స్థానాలు గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. మూడోసారి తప్పకుండా అధికారంలోకి రావాలని కేంద్రహోం మంత్రి అమిత్ షా యూపీ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం లక్నోలో జరిగిన యూపీ బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు. కేంద్ర మంత్రి పంకజ్ చౌధురి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా లక్నోలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేష్ పాఠక్‌తో పాటు పలువురు ప్రముఖ నేతలు ఈ కార్యక్రమానికి వచ్చారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి వినోద్ తావ్డే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ, గోరఖ్‌పూర్ ఎంపీ రవికిషన్ తదితరులు హాజరయ్యారు.2027 ఎన్నికల్లో 2017 నాటి విజయాన్ని రిపీట్ చేయాలని యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వ్యక్తిగత ఆశలు,



ఆశయాలను పక్కనపెట్టి 325 నుంచి 350 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మరో డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ 337 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. యోగి నాయకత్వంలో యూపీ చాలా అభివృద్ధి చెందిందని అన్నారు. ఇదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీపై బీజేపీ విమర్శలు గుప్పించింది. బీజేపీ సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ అనే సూత్రంతో పనిచేస్తే, సమాజ్‌వాదీ పార్టీ కుటుంబ ప్రయోజనాల కోసం పనిచేస్తుందని అన్నారు

వాల్‌స్ట్రీట్ వివాదంపై ట్రంప్‌కు అమెరికా కోర్టులో ఎప్‌స్టీన్ షాక్

వాషింగ్టన్, నవంబరు 1: వివాదాస్పద లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు పుట్టినరోజు లేఖ రాసినట్లు అమెరికాకు చెందిన వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసిన కథనం తప్పంటూ కోర్టుకెక్కిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ తప్పలేదు. ఎప్‌స్టీన్‌తో తన బంధాన్ని తప్పించుకునేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నం కాస్తా విఫలమైంది. ఎప్‌స్టీన్‌కు ట్రంప్ పంపిన అశ్లీల లేఖపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించగా.. అది కల్పితం అంటూ ట్రంప్ కోర్టులో దావా వేశారు. అయితే ఆయన దాఖలు చేసిన పరువునష్టం దావాను విచారణ చేసిన కోర్టు.. దీన్ని కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది. గతంలో ఎపిస్టీన్‌కు ట్రంప్ అశ్లీల లేఖ రాశారంటూ వాల్‌స్ట్రీట్ ప్రచురించిన కథనంపై ఆయన కోర్టును ఆశ్రయించగా.. ఈ యేడాది ఏప్రిల్‌లో.. ఆయన పిటిషన్ సవరించుకునేందుకు అవకాశం దక్కింది. అయినా దాన్ని సవరించకుండా అలాగే దావా కొనసాగించిన ట్రంప్‌కు ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా ఇప్పుడు కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ పరువు నష్టం దావాను సవరించడానికి కానీ లేక తిరిగి దాఖలు చేయడానికి కానీ వీల్లేకుండా ఈసారి న్యాయమూర్తి తీర్పు ప్రకటించారు. ఈ సందర్భంగా కోర్టు వాల్‌స్ట్రీట్ పత్రిక అనుసరించిన పత్రికా ప్రమాణాలతో ఏకీభవించింది. ఈ కథనం ప్రచురణకు ముందే డొనాల్డ్ ట్రంప్ స్పందన తీసుకునేందుకు పత్రిక ప్రయత్నించడం, ఆయన ప్రత్యక్షంగా ఈ కథనాన్ని ఖండిస్తూ ఇచ్చిన ప్రకటలను కోర్టు గుర్తించింది.

ధరల అడ్డుకట్టకు 'సిల్కీ సార్టెక్స్' బియ్యం!

సన్నరకాలు సరిహద్దులు దాటుతున్నా కట్టడిలో విఫలం

ఐదు శాతం నూకతో కూడిన బియ్యం విక్రయాలకు సివిల్ సప్లయ్ చొరవ చూపాలి

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: ప్రభుత్వం మిల్లుల నుంచి నేరుగా సిల్కీసార్టెక్స్ చేసిన ఐదుశాతం నూకల పరిమితి గల బియ్యం సేకరించి బహిరంగ మార్కెట్‌లో విడుదల చేస్తే తెలంగాణ వ్యాప్తంగా పెరుగుతున్న బియ్యం ధరలకు కట్టడి వేయడానికి వీలవుతోంది. తెలంగాణలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం పొందని కోటికిపైగా వినియోగదారులు సిల్కీసార్టెక్స్ బియ్యం తినడకు మక్కువ చూపుతారు. వారికి అదే పద్ధతిలో మరాడించిన బియ్యంను 26కిలోల బస్తాను రూ.1300కు కోఆపరేటివ్ సొసైటీల నుంచో లేదా రేషన్ దుకాణాల నుంచి ఇతర రైతుబజారు కౌంటర్లతో విక్రయించి ధరలను కట్టడి చేయడానికి వీలవుతోంది. ప్రస్తుతం ఎఫ్‌సిఐకి బియ్యం కిలో 40రూపాయలు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం వినియోగదారులకు కిలోకు 50రూపాయలకు సన్నాలను సుమారు ఆరు నెలలు బహిరంగ మార్కెట్‌లో విడుదల చేస్తే బియ్యం వ్యాపారులను కట్టడి చేయడమే కాకుండా ప్రజలకు తక్కువ ధరకు సరఫరాచేయడానికి వీలవుతుంది. తెలంగాణలో బియ్యం ధరలు నానాటికి ఆకాశాన్ని అంటుకొని మధ్యతరగతి,ఎగుమధ్యతరగతి ఉన్నత వర్గాలను కూడా ఆందోళనకు గురిచేస్తోన్నది. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో అత్యంత తక్కువ పరిమాణంలో ధాన్యం దిగుబడి కాగా పండిన పంటను పొరుగు రాష్ట్రాల వ్యాపారులు మూడున్నర వేల రూపాయలనుంచి నాలుగువేలకు క్వింటాల్ చొప్పున ధర పెట్టి కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నా ప్రభుత్వం కట్టడి చేయడంలో విఫలమైపోతున్నది. గత ఏడాది రాష్ట్రంలో 92.17 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో 78.23 లక్షల ఎకరాలకే పరిమితం అయింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలో ధాన్యం దిగుబడి అంచనాల మేరకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు యాసంగి సాగు చేయవద్దని ప్రభుత్వమే ప్రచారం చేస్తుండటంతో సగటు బియ్యం వినియోగదారులకు భయం పుట్టిస్తోంది.తెలంగాణ లో సన్నాల లభ్యత ఇప్పటికే తగ్గుముఖం పట్టింది.ఈ నేపథ్యంలో భవిష్యత్తులో సన్నాల ధరలపై దీని ప్రభావం మరింతగా ఉండనుంది. సన్నాలు ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్, వరంగల్,కరీంనగర్ జిల్లాల్లో ఎక్కువగా సాగవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో కోతలు మొదలవ్వగానే మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాపారులు వచ్చి ధాన్యాన్ని కొనేస్తున్నారు. దేశంలోని ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి మహా నగరాలకు వీటిని భారీ మొత్తంలో తరలిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో బియ్యం లభ్యత తగ్గుతోందనీ కొందరు నల్లబజారులో నిల్వ చేస్తున్నారు. ఇది పరోక్షంగా బియ్యం ధరలు పెరిగేందుకు కారణమైంది. ఖరీఫ్ ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే సమయంలో బియ్యం ధరలు సాధారణంగా తగ్గుముఖం పట్టాల్సి ఉండగా ఈ యేడు వందకు చేరువలో ఆకాశాన్ని అంటుకొని మధ్యతరగతి ఎగువ మధ్యతరగతి జీవులను ఆందోళనకు గురిచేస్తోంది. తెలంగాణలో ఒక కోటి ఆరు లక్షలకు పైగా రేషన్‌కార్డులు ఉండగా 3కోట్ల 42లక్షలకు పైగా లబ్ధిదారులకు సన్నబియ్యం పౌరసరఫరాలశాఖ నుంచి అందుతు న్నాయి. తెలంగాణ జనాభా సుమారు 4.35కోట్ల ఉంది. సుమారు 90లక్షల నుంచి కోటి మంది మాత్రమే బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసిన బియ్యంను ఆహారంగా తీసుకొంటారు. ఈ కోటి మంది మాత్రమే బ్లాక్ మార్కెట్ వ్యాపారుల అధిక ధరల బాధితులు అవుతున్నారు. తెలంగాణలో దిగుబడి చేసిన మేలురకం ధాన్యం నాగపూర్,రాయపూర్‌లో మిల్లింగ్ చేసి తిరిగి తెలంగాణకు తరలించి బ్రాండుల పేరుతో కొంత మంది వ్యాపారులు కిలోకు వందరూపాల చొప్పున విక్రయిస్తూ వినియోగదారులను దోచుకొంటున్నారు. పౌర సరఫరాల సంస్థ గత ఖరీఫ్‌లో 72 లక్షల టన్నుల సన్నరకం ధాన్యాన్ని సేకరించగా అందులో పిడిఎస్ అవసరాలకు పోగా 5 లక్షల టన్నులే మిగులు ఉంది. వీటిని కోటి మందికి సుమారు వచ్చే 7 నెలలు మార్కెట్‌లో అందించ డానికి వీలవుతోంది. ఒక్కో వినియోగదారుడు సగటున ఏడు కిలోలు బియ్యం వినియోగం చేసినా ఏడుకోట్ల కిలోల బియ్యం నెలకు పడుదోంది.అంటే 70వేల మె.ట బియ్యం బహిరంగా మార్కెట్‌లో వినియోగదారుడు కొనులు చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఈ దిశగా ఆలోచనచేస్తే వినియోగ దారుడుకి తెలంగాణలోని మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు ఊరట లభిస్తోంది.

వరి వద్దు.. నాట్లకు దూరంగా ఉండాలి

ప్రత్యామ్నాయ పంటలే సాగుచేయాలి

రైతులకు వ్యవసాయ శాఖ కీలక హెచ్చరికలు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త : రబీ సీజన్ ప్రారంభమవుతున్న వేళ వరి పంట సాగుపై వ్యవసాయ శాఖ ఆంక్షలు పెడుతోంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి పంటను సాగు చేయవద్దని స్పష్టం చేసింది. వరి నారుమళ్లు, నాట్లుకు దూరంగా ఉండాలని తేల్చిచెబుతోంది. తక్కువ నీటితో పండే పంటలను మాత్రమే సాగు చేయాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగంలో ప్రచారం చేస్తోంది. రాష్ట్ర కమిషనరేట్ అధికారులతో సహా అన్ని జిల్లాలు, మండల, గ్రామ వ్యవసాయ అధికారులు అందరూ ప్రస్తుతం ఇదే ప్రచార కార్యక్రమంలో పాల్గొంటూ రబీ సాగుపై ఆంక్షలు,సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతులు ఈ రబీ సీజన్‌లో వరి పంట వేయొద్దని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే నష్టాల నుంచి బయటపడటంతో పాటు మంచి ఆదాయం పొందవచ్చని వివరిస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రారంభమై మార్చి, ఏప్రిల్ వరకు కొనసాగుతుంది. ఈ పంటలు ప్రధానంగా నేలలో ఉండే తేమ, శీతాకాలంలో కురిసే వర్షాలు, కాలువలు, బోరుబావుల ద్వారా అందే నీటిపై ఆధారపడి సాగవుతాయి. అయితే ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు కూడా క్షీణించే పరిస్థితులు ఎదురైతే వరి సాగు రైతులకు భారంగా మారుతుంది. ముఖ్యంగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ వరి పంటకు నీటి అవసరం మరింత ఎక్కువవుతుంది.

హాంగ్‌కాంగ్ సిక్సెస్ ఛాంపియన్‌గా అఫ్ఘాన్

ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో ఓటమి



హాంగ్ కాంగ్: మిషన్ రోడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆస్ట్రేలియాను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి, ఆఫ్ఘనిస్తాన్ తమ తొలి హాంగ్ కాంగ్ సిక్సెస్ ఛాంపియన్‌గా అవతరించి చరిత్ర సృష్టించింది. గుల్బదిన్ నైబ్ నేతృత్వంలో, ఆఫ్ఘనిస్తాన్ ఫైనల్‌లో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచి, ఆస్ట్రేలియా నిర్దేశించిన 116 పరుగుల లక్ష్యాన్ని కేవలం 5.1 ఓవర్లలోనే ఛేదించి, తొలిసారిగా ప్రతిష్టాత్మక ట్రోఫీని కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా, తమకు కేటాయించిన ఆరు ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. మాక్స్ బ్రయంట్ మెరుపు వేగంతో 44 పరుగులు చేసి స్కోరింగ్‌లో ముందుండగా, అలెక్స్ రాస్ 29 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నిక్ హాబ్సన్ కూడా కేవలం 23 పరుగులు చేశాడు. అయితే, ఆఫ్ఘనిస్తాన్ ఛేజింగ్‌ను సునాయాసంగా ముగించి, ఐదు బంతులు మిగిలి ఉండగానే 119/2 స్కోరును చేరుకుంది. ఇమ్రాన్ మీర్ 53 పరుగులు చేసి, ఆఫ్ఘనిస్తాన్‌కు పటిష్టమైన ఆరంభాన్ని అందించాడు. ఆ తర్వాత ఫర్మానుల్లా సఫీ 26 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, కెప్టెన్ నైబ్ 17 పరుగులు చేశాడు. గ్రూప్ ఎలో తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 108 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి మూడు వికెట్ల విజయంతో ఆఫ్ఘనిస్తాన్ టైటిల్ వేట మొదలైంది. ఆ తర్వాత ఒమన్‌ను 120 పరుగులకే పరిమితం చేసి, 5.2 ఓవర్లలోనే ఛేజింగ్‌ను పూర్తి చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. సెమీఫైనల్‌లో 121 పరుగులు చేసిన తర్వాత, స్కాట్లాండ్‌ను 100 పరుగులకే కట్టడి చేసి ఫైనల్‌లో తమ స్థానాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో, హాంగ్ కాంగ్ సిక్సెస్ గెలిచిన ఎనిమిదవ దేశంగా ఆఫ్ఘనిస్తాన్ నిలిచింది.

ఆట

2వ అనధికారిక టెస్ట్:

ఇండియాపై పట్టు సాధించిన న్యూజిలాండ్



హ్యాగ్లీ ఓవల్ : హ్యాగ్లీ ఓవల్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో, రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా ఎ పై న్యూజిలాండ్ ఎ పట్టు సాధించింది. టీమిండియా చేసిన 346 పరుగుల తొలి ఇన్నింగ్స్ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, మాట్ బాయిల్, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్‌ల మధ్య జరిగిన అజేయ 205 పరుగుల భాగస్వామ్యంతో న్యూజిలాండ్ ముందుకొచ్చింది. భోజన విరామానికి ముందు మహమ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టిన తర్వాత, బాయిల్, ఫాక్స్‌క్రాఫ్ట్ కలిసి ఆరంభంలో ఎదురైన ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొని తమ సత్తా చాటారు. తర్వాత స్పిన్నర్లు, పేసర్లు ఇద్దరూ వైఫల్యం చెందడంతో ఆ ఇద్దరు బ్యాటర్లు చెలరేగిపోయారు. బాయిల్ 107 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, ఫాక్స్‌క్రాఫ్ట్ 80 పరుగులతో కొనసాగనున్నాడు. అంతకుముందు, తొలి రోజు ఆటను 99 పరుగులతో నాటౌట్‌గా ముగించిన టీమిండియా కెప్టెన్ ధ్రువ్ జురెల్ తన శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే, ఆ మైలురాయిని చేరుకున్న వెంటనే, స్లిప్ కార్డన్‌కు క్యాచ్ ఇచ్చి అతను అవుటయ్యాడు. తన కెప్టెన్‌తో కలిసి దృఢంగా ఆడిన ఆకాశ్ దీప్, అతను అవుటైన తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. అతను 116 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 68 పరుగులు చేసి, టీమిండియాను గౌరవప్రదమైన 346 పరుగుల స్కోరుకు చేర్చాడు.

న్యూజిలాండ్ విజయం

7 వికెట్ల తేడాతో టీమిండియా ఘోర ఓటమి

హామిల్టన్: న్యూజిలాండ్ జట్టుతో జరిగిన సిరీస్‌లోని చివరి టీ20 మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు 7 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. మొదట భారత్ 8 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేయగా, లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ కేవలం 3 వికెట్ల నష్టానికి 18వ ఓవర్‌లోనే లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. అయితే భారత్ 3-2 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ కేవలం ఒక పరుగు చేసి ఔటయ్యాడు. సంజు శాంసన్ 4 పరుగులకే పెవిలియన్ చేరాడు. కష్టాల్లో పడిన టీమిండియాను ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆదుకున్నారు. వీరిద్దరూ 93 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇషాన్ అద్భుతమైన ఫామ్‌లో అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. ఇషాన్ 61 పరుగుల పవర్‌ఫుల్ ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఔటవ్వగా, తిలక్ వర్మ కేవలం ఆరు పరుగులు చేసి విఫలమయ్యాడు. చివరి ఓవర్లలో నమన్ ధీర్, నితీష్‌కుమార్ కలిసి 46 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 33 పరుగులు చేసిన నమన్ ధీర్ ఔవుటయ్యాడు. మరోవైపు నితీష్ 22 పరుగులు, భువనేశ్వర్ కుమార్ 6 పరుగులు చేశాడు. అనంతరం లక్షఛేదనలో అర్ష్‌దీప్ సింగ్ ఫిన్ అలెన్‌ను అవుట్ చేసి న్యూజిలాండ్‌ను తొలి



దెబ్బ కొట్టాడు. ఫిన్ అలెన్ 2 పరుగులు చేసి అవుటయ్యాడు. డారిల్ మిచెల్, టిమ్ సీఫెర్ట్‌ల మధ్య 73 పరుగుల భాగస్వామ్యం మొదలైంది. ఆ తర్వాత వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో డారిల్ మిచెల్ (29) ఔటయ్యాడు. దీంతో న్యూజిలాండ్ స్కోరు 82/2కి పడిపోయింది. న్యూజిలాండ్ 168 పరుగుల వద్ద విజయం దిశగా సాగుతున్న తరుణంలో టిమ్ సీఫెర్ట్ (93) నితీష్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్), బెవాన్ జాకబ్స్ (1 నాటౌట్) చివరి వరకు క్రీజులో నిలిచి విజయాన్ని అందించారు.



మహిళల కబడ్డీలో ఛాంపియన్‌గా భారత్

అమ్మదాబాద్: తొలి కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026లో స్వర్ణం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించింది. ఫైనల్‌లో ఆతిథ్య జట్టు ఉగాండాపై 35-15 తేడాతో ఘన విజయం సాధించింది. సాక్షి భారత్ తరపున తన పాయింట్ల పరంపరను కొనసాగిస్తూ, 7 టచ్, 2 బోనస్ పాయింట్లతో సహా 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అను సేన్ ఆరు పాయింట్లతో రాణించగా, కెప్టెన్ నిధి శర్మ ఐదు పాయింట్లు సాధించింది. రితు మిథర్వాల్ మరియు సుమన్ సాహు డిఫెన్స్‌లో చెరో నాలుగు టాకిల్ పాయింట్లతో మెరిశారు. నకయోంగో షిరాత్ 11 పాయింట్లు సాధించి, ఓడిపోయిన జట్టు తరపున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఉగాండా సెమీఫైనల్ విజయంలో కీలక పాత్ర పోషించినా, భారత రైడర్ల ముందు తడబడింది. ఫైనల్ పోరులో ఆఫ్రికా దిగ్గజాలు ఒత్తిడికి తలొగ్గడంతో తొలి అర్ధభాగం ముగియడానికి మూడున్నర నిమిషాలు మిగిలి ఉండగానే భారత్ ఆల్‌అవుట్ చేసింది. విరామ సమయానికి భారత్ 22-7 ఆధిక్యంతో పటిష్టమైన స్థితిలో ఉంది. భారత రైడర్లు ఆటను శాసించడంతో తొలి అర్ధభాగంలో ఉగాండా ఒక్క టాకిల్ పాయింట్‌ను కూడా సాధించలేకపోయింది. రెండవ భాగంలో కూడా ఆతిథ్య జట్టు తమ ఆధిపత్యాన్ని కొనసాగించి రైడ్, టాకిల్ పాయింట్లలో వరుసగా 20-14 మరియు 10-1 ఆధిక్యాన్ని సాధించింది. రెండు ఆల్‌అవుట్‌లకు గాను వారు నాలుగు అదనపు పాయింట్లను కూడా సంపాదించారు. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన భారత్, ఆ తర్వాత శ్రీలంక, ఉగాండాలపై నాకౌట్ విజయాలు సాధించి ప్రతిష్టాత్మక స్వర్ణాన్ని కైవసం చేసుకుంది.

గిల్ సేనకు దక్షిణాఫ్రికా షాక్

భారత్‌కు ఛాలెంజ్‌గా డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్

న్యూఢిల్లీ: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో భారత్ వెనుకబడిపోయింది. దక్షిణాఫ్రికా విజయం తర్వాత డబ్ల్యూటిసి ఫైనల్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. ఫైనల్ రేసులో లెక్కలు వేగంగా మారుతున్నాయి. ఆస్ట్రేలియాతో మూడు టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2-1తో గెలుచుకోవడంతో పాయింట్ల పట్టికలో భారీ మార్పు వచ్చింది. ఫలితంగా భారత్ ఇక ప్రతి టెస్టును కీలకంగా తీసుకోవాల్సిన పరిస్థితి తప్పనిసరి ఏర్పడింది. తొలి టెస్టులో ఓడిన తెంబా బవుమా బృందం వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా 71.42 శాతం పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. ఇక న్యూజిలాండ్ 72.22 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా 69.23 శాతంతో మూడో స్థానానికి పడిపోయింది. భారత్ 51.52 శాతంతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇక్కడే టీమిండియాకు అసలు చిక్కు మొదలైంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుకు ఇంకా ఏడు టెస్టులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిలో అత్యధిక మ్యాచ్‌లు గెలవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా తర్వాత బంగ్లాదేశ్, ఇంగ్లండ్‌తో స్వదేశంలో సిరీస్‌లు ఆడనుంది. ఆ రెండు సిరీస్‌ల్లో దక్షిణాఫ్రికా ఆధిపత్యం కొనసాగితే ఆ జట్టు ఫైనల్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో మిగిలిన స్థానానికి భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య పోటీ మరింత తీవ్రంగా మారుతుంది. భారత్ ముందుగా న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ రెండు మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధిస్తే పాయింట్స్ పర్సంటేజ్ 58.97కు చేరుతుంది. అయితే రెండు టెస్టుల్లోనూ ఓడితే అది 43.59కు పడిపోతుంది. అప్పుడు డబ్ల్యూటిసి ఫైనల్ అవకాశాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఆ తర్వాత భారత్ స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టులు ఆడనుంది. న్యూజిలాండ్‌పై రెండు మ్యాచ్‌లు ఓడి, ఆస్ట్రేలియాపై ఐదు టెస్టులను గెలిచినా భారత్ పాయింట్స్ పర్సంటేజ్ 59.26 వద్దే ఉంటుంది. ఆ పరిస్థితిలో ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇక మిగిలిన ఏడు టెస్టుల్లో ఆరు గెలిస్తే భారత్ పాయింట్స్ పర్సంటేజ్ 64.81కు చేరుతుంది. అయినా ఫైనల్ బెర్త్ ఖాయమవుతుందని చెప్పలేం. అందుకే భారత్‌కు ఏడు మ్యాచ్‌ల్లో ఏడు విజయాలు అత్యుత్తమ మార్గంగా కనిపిస్తోంది. ఆరు విజయాలు సాధించినా ఇతర జట్ల ఫలితాలు భారత్‌కు అనుకూలంగా రావాల్సి ఉంటుంది.



యుపిఐలో సరికొత్త రికార్డు

రూ.లక్ష కోట్లు దాటిన రోజువారీ లావాదేవీల విలువ



న్యూఢిల్లీ, నవంబరు 1: దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన డిజిటల్ చెల్లింపుల వేదిక యుపిఐ అక్టోబర్ నెలలో సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలిసారిగా యుపిఐ సగటు రోజువారీ లావాదేవీల విలువ రూ.లక్ష కోట్ల మార్కును దాటింది. అక్టోబరు నెలలో ఈ డిజిటల్ చెల్లింపుల వేదిక ద్వారా మొత్తం రూ.31.53 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు నమోద య్యాయి. యుపిఐ చరిత్రలో నెలవారీ లావాదేవీల విలువ రూ.30 లక్షలకోట్లను అధిగమించడం ఇదే తొలిసారి. పండు గల సీజన్‌లో వినియోగదారుల ఖర్చులు పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ముఖ్యంగా రిటైల్, ఈకామర్స్ తదితర రంగాల్లో కొనుగోళ్ల పెరగడంతో డిజిటల్ చెల్లింపుల వినియోగం గణనీయంగా వృద్ధి చెందింది. ఇప్పటివరకు యుపిఐలో అత్యధిక నెలవారీ లావాదేవీల విలువ రూ.29.9 లక్షల కోట్లుగా ఉంది. 2026 మే నెలలో ఈ రికార్డు నమోదైంది. అక్టోబర్‌లో అది అధిగమించబడింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) గణాంకాల ప్రకారం అక్టోబరు నెలలో యూపీఐ ద్వారా మొత్తం 2,547 కోట్ల లావాదేవీలు జరిగాయి. అంటే రోజుకు సగటున 82.1 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఇంతకుముందు అత్యధిక సగటు రోజువారీ లావాదేవీల సంఖ్య సెప్టెంబరులో 802 మిలియన్లుగా నమోదైంది. అలాగే, అత్యధిక నెలవారీ లావాదేవీల సంఖ్య 24.5 బిలియన్లుగా ఉండగా, ఆగస్టులో ఈ రికార్డు నమోదైంది. అక్టోబర్‌లో ఈ రెండు రికార్డులు సైతం దాటేసాయి. డిజిటల్ చెల్లింపులు రికార్డు స్థాయిలో పెరుగుతున్న తరుణంలో యుపిఐ వ్యవస్థలో మరో కీలక మార్పునకు రంగం సిద్ధమవుతోంది. ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) ఛార్జీలను అమలు చేసే ప్రతిపాదన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వ్యాపారుల సంఘాలు, ఫిన్‌టెక్ కంపెనీలు, చెల్లింపుల సేవల సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఎన్‌పిసిఐ ఎండిఆర్ ఛార్జీల అమలును దీపావళి తర్వాతకు వాయిదా వేసింది.

వాణిజ్య సిలిండర్ ధర రూ.11.50 పెంపు

ఎటిఎఫ్ ధరల్లోను సవరణలు ప్రకటించిన ఆయిల్ కంపెనీలు



న్యూఢిల్లీ, నవంబరు 1: దీపావళి పండుగ వేళ కేంద్ర ప్రభుత్వం ధరల బాంబు పేల్చింది. పండుగకు ముందే వ్యాపారులు, రెస్టారెంట్లు, హోటళ్ల రంగంపై అదనపు భారం మోపుతూ 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను మరోసారి పెంచింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ వరుసగా మూడోసారి వాణిజ్య సిలిండర్ ధరను పెంచాయి. పెంచిన ధరలు నవంబరు 1,2026 నుంచే అమలులోకి వస్తాయి. ఒక్కో సిలిండర్‌పై దాదాపు రూ.10 నుంచి రూ.11.50 వరకు పెంచుతున్నట్లు ప్రకటించాయి. గృహ వినియోగదారులకు ఊరట కల్పిస్తూ 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్‌పిజీ ధరల్లో ఎలాంటి మార్పులు లేకుండా స్థిరంగా ఉంచాయి. మరోసారి 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచడంతో ఒక్కో సిలిండర్ ధర రూ.3000లకు చేరువైంది. నగరాల వారీగా చూసుకుంటే దేశీయ రాజధాని ఢిల్లీలో ఎల్‌పిజి సిలిండర్ 19 కిలోల ధర రూ.2,820కి చేరింది. ముంబైలో ఈ సిలిండర్‌ధర రూ.2,774.5 వద్దకు చేరగా, కోల్‌కతాలో రూ.2,964 వద్దకు ఎగబాకింది. ఇక చెన్నై నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.2,994.50 వద్దకు చేరింది. సవరించిన ఈ కొత్త ధరలతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ తయారీ సంస్థలు, కేటరింగ్స్ వంటి వారిపై అదనపు భారం పడుతుంది. హైదరాబాద్ మహానగరంలో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.3 వేల పైన పలుకుతోంది. తాజా పెంపుతో ఒక్క సిలిండర్ రేటు రూ.3065 పైనఉంది. అక్టోబరు 1వ తేదీన కమర్షియల్ సిలిండర్ రేటును రూ.62.50 చొప్పున పెంచిన సంగతి తెలిసిందే. తాజాగా మరో రూ.10 పెంచడంతో అదనపు భారం మోపినట్లయింది. విమానయాన టర్బైన్ ఇంధనం ఎటిఎఫ్ ధరలు మరోసారి పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బెంచ్‌మార్క్ ధరలు పెరగడంతో ఆదివారం నుంచి లీటరుకు రూ.1.37 చొప్పున ధరను పెంచారు. దీంతో దేశీయ విమానయాన సంస్థలకు ఎటిఎఫ్ ధర లీటరుకు రూ.138.30కు చేరింది. వరుసగా నాలుగో నెల కూడా విమాన ఇంధనం ధరలు పెరగడం గమనార్హం. గతంలో అక్టోబరు 1న లీటరుకు ఏకంగా రూ.16 పెంచగా, సెప్టెంబర్ 1న రూ.6.28, ఆగస్టు 1న రూ.5 చొప్పున పెంచారు. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ వ్యయంలో విమాన ఇంధన వాటా సుమారు 35 నుంచి 40 శాతం వరకు ఉంటుంది.



ధనత్రయోదశి వేళ పసిడి, వెండిధరల్లో గుడ్‌న్యూస్

ముంబయి, నవంబరు 1: పండగ సీజన్ ముంగిట పసిడి కొనుగోలుదారులకు ఊహించని గుడ్‌న్యూస్. ధనత్రయోదశి, దీపావళి సమీపిస్తున్న వేళ బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. అంతర్జాతీయమార్కెట్లలో నెల కొన్న బలహీన ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయ మార్కెట్లలోనూ ధరలు తగ్గాయి. దీంతో పండగ కొనుగోళ్లకు సిద్ధమవుతున్న వారికి ఇది గొప్ప ఊరటనిచ్చే అంశంగా మారింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శనివారం ధరల పతనం తీవ్రంగా కనిపించింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంధర రూ.3,380తగ్గి రూ.1,38, 880కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.3,100 క్షీణించి రూ.1,27,300 వద్ద స్థిరపడింది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. కిలో వెండి ధర రూ.8,000 వరకు పతనమై రూ.2 లక్షల మార్కుకు దిగివచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.3,200 తగ్గి సుమారు రూ.1.42 లక్షల స్థాయికి చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇక వెండి ధర కిలోపై రూ.4,200 తగ్గి రూ.1.86 లక్షల నుంచి రూ.1.90 లక్షల మధ్యకు పడిపోయింది. ఇది దాదాపు 11 నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఈ భారీ తగ్గుదలకు పలు జాతీయ, అంతర్జాతీయ కారణాలు దోహదం చేశాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 110 డాలర్ల ఎగువన ట్రేడ్ అవుతున్నాయి. దీనికి తోడు ద్రవ్యోల్బణ భయాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించకపోవచ్చన్న అంచనాలు బల పడ్డాయి. మరోవైపు, ఎఐ బూమ్ ముగిసిం దనే ఆందోళనలతో టెక్నాలజీ షేర్లు పతనం కావ డంతో, ఇన్వెస్టర్లు నష్టాల భర్తీ కోసం బంగారం, వెండిలో తమ పెట్టుబడులను అమ్మి నగదుగా మార్చుకుంటున్నారు. ముందురోజు నాటి భారీ పతనం తర్వాత ఆదివారం మార్కెట్ కొంత స్థిరంగా కనబడుతోంది.

రిటైల్ ఇన్వెస్టర్లకోసం ఆర్బీఐ కొత్త పెట్టుబడి పథకం



ముంబయి, నవంబరు 1: షేర్ మార్కెట్ల హెచ్చుతగ్గుల భయాలు లేకుండా, సంపాదించిన కష్టార్జితానికి 100 శాతం భద్రతతో పాటు స్థిరమైన రాబడిని కోరుకునే భారతీయ ఇన్వెస్టర్లకు రిజర్వుబ్యాంకు గొప్ప సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాచుర్యం కల్పిస్తున్న ఆర్‌బిఐ రిటైల్ డైరెక్ట్ పథకం ద్వారా ఇకపై సామాన్య రిటైల్ ఇన్వెస్టర్లు సైతం ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడులు పెట్టవచ్చు. కేవలం రూ.10,000 కనీస మొత్తంతో ప్రారంభమయ్యే ఈ డిజిటల్ ప్లాట్ ఫామ్ విశేషాలు, అందుబాటులో ఉండే ప్రభుత్వ బాండ్లు, దీని ప్రయోజనాలపై అటు యూనియన్‌బ్యాంకు, ఇటు ఆర్బీఐలు విస్తృత ప్రచారంచేస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు మూడు రకాల ప్రభుత్వ పథకాలలో పెట్టుబడి పెట్టవచ్చు.

అందులో కేంద్ర ప్రభుత్వ డేటెడ్ సెక్యూరిటీలు ఒకటి. దీర్ఘకాలిక భద్రతను కోరుకునే వారి కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే స్థిర వడ్డీ బాండ్లు. కనీస పెట్టుబడి రూ.10,000 నుంచి ప్రారంభమవుతుంది. ఇక రెండోది ట్రెజరీ బిల్లులు. స్వల్పకాలిక పెట్టుబడుల (91 రోజులు, 182 రోజులు లేదా 364 రోజులు) కోసం ఉద్దేశించినవి. వీటిలో కూడా కనీస పరిమితి రూ.10 వేలుగా నిర్ణయించారు. మూడోది రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పన కోసం జారీ చేసే బాండ్లు. వీటిలో కూడా అత్యల్పంగా రూ.10 వేలతో భాగస్వామ్యం కావచ్చు. ఆర్‌బిఐ రిటైల్ డైరెక్ట్ ద్వారా ఇన్వెస్ట్ చేసే వారికి సావరిన్ గ్యారెంటీ లభిస్తుంది. భారత ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాల నేరుగా ఇచ్చే భద్రత కాబట్టి ఎలాంటి డిఫాల్ట్ రిస్క్ ఉండదు. దళారులు లేదా బ్రోకర్లతో పని లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఇంట్లో కూర్చునే ఖాతా తెరిచి బాండ్లను కొనుగోలు చేయవచ్చు. మీ ఖాతాకు నామినీ సదుపాయంతో పాటు ఆన్‌లైన్ సేవలు సులువుగా లభిస్తాయి. స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లలో ఉండే రిస్క్‌ను తగ్గించుకోవడానికి మీ సంపదను సురక్షితమైన బాండ్లలోకి మళ్లించవచ్చు.

22.9% వృద్ధితో రూ.2.31 లక్షల కోట్లకు జిఎస్‌టి వసూళ్లు



న్యూఢిల్లీ, నవంబరు 1: అక్టోబరు నెల భారతదేశ స్థూల వస్తువులు, సేవల పన్ను వసూళ్ల వివరాలను కేంద్రం విడుదలచేసింది. విడుదల చేశారు. జిఎస్‌టి వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 22.9 శాతం పెరిగి రూ. 2.31 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది గత నాలుగేళ్లలో నమోదైన అత్యంత వేగవంతమైన వృద్ధి. సెప్టెంబరులో నమోదైన 14.7 శాతం వృద్ధితో పోలిస్తే, అక్టోబరులో ఈ వృద్ధివేగంగా పుంజుకుంది. వరుసగా నాలుగు నెలల పాటు నెలవారీ జిఎస్‌టి వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్కును దాటడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, ఏప్రిల్ నెలలో నమోదైన రూ. 2.43 లక్షల కోట్ల తర్వాత, అక్టోబరు నెల వసూళ్లు రెండో అత్యధిక స్థాయిగా నిలిచాయి. ఈ వృద్ధికి ప్రధాన కారణం దిగుమతుల ద్వారా వచ్చిన ఆదాయంగా చెబుతున్నారు. ఇది గత యేడాది అక్టోబర్‌లోని రూ.50,796 కోట్లతో పోలిస్తే ఈ యేడాది 42.2 శాతం పెరిగి రూ. 72,246 కోట్లకు చేరుకుంది. దేశీయ జిఎస్‌టి ఆదాయం 15.8 శాతం వృద్ధితో రూ. 1.59 లక్షల కోట్లకు పెరిగింది గత యేడాది ఇదే కాలంలో ఇది రూ. 1.37 లక్షల కోట్లుగా ఉంది. నికర జిఎస్‌టి ఆదాయం 25.6 శాతం పెరిగి రూ. 2.03 లక్షల కోట్లకు చేరుకుంది గత ఏడాది అక్టోబరులో ఇది రూ. 1.62 లక్షల కోట్లుగా ఉంది. ఈ నెలలో మొత్తం రీఫండ్‌లు 6.5 శాతం పెరిగి రూ. 27,934 కోట్లకు చేరుకున్నాయి. ఇది స్థూల వసూళ్ల వృద్ధి రేటుతో పోలిస్తే చాలా తక్కువ. తాజా గణాంకాలు గత కొన్ని నెలలుగా పన్ను ఆదాయ వృద్ధి వేగం పుంజుకుందని సూచిస్తున్నాయి. జూన్‌లో 13.9 శాతం, జూలైలో 15.4 శాతం, ఆగస్టులో 14.3 శాతం, సెప్టెంబర్‌లో 14.7 శాతం వృద్ధిని నమోదు చేసిన జిఎస్‌టి వసూళ్లు, అక్టోబరులో 22.9 శాతానికి పెరిగాయి. 2027 ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్-అక్టోబరు కాలానికి మొత్తం స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ. 14.78 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇది గత యేడాది ఇదే కాలంలోని రూ. 13.05 లక్షల కోట్లతో పోలిస్తే 13.2 శాతం పెరుగుదల నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లో నికర జిఎస్‌టి వసూళ్లు 12.6 శాతం పెరిగి రూ. 12.69 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ప్రధాన రాష్ట్రాల్లో మహారాష్ట్ర దేశీయ జిఎస్‌టి వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచింది. అక్టోబరు నెలలో ఆ రాష్ట్ర ఆదాయం 13 శాతం పెరిగి రూ. 35,150 కోట్లకు చేరుకుంది. కర్ణాటకలో వసూళ్లు 18 శాతం పెరిగి రూ. 15,922 కోట్లుగా నమోదు కాగా, గుజరాత్‌లో 16 శాతం వృద్ధితో రూ. 13,516 కోట్లు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో 24 శాతం వృద్ధితో వసూళ్లు రూ. 10,235 కోట్లకు చేరుకోగా, ఢిల్లీలో 10 శాతం పెరిగి రూ. 9,298 కోట్లుగా నమోదయ్యాయి. అస్సాం రాష్ట్రంలో అత్యధిక వృద్ధి రేట్లలో ఒకటి నమోదైంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.